విశాలాంధ్ర

ప్రకాశం
బాపట్ల

శనివారం 07 సెప్టెంబర్ 2024 8 పేజీలు



ప్రబలుతున్న రోగాలు

- మంచంపట్టిన పల్లెలు
- ప్రభుత్వ వైద్యం కోసం ఎదురు చూపులు
- పల్లెల్లో విజృంభిస్తున్న డెంగ్యూ, మలేరియా
- ఒక్కసారిగా వాతావరణంలో మార్పు
- పడకేసిన పారిశుద్ధ్యం
- రోజురోజుకు ప్రబలుతున్న అంటు వ్యాధులు
- చర్యలు తీసుకుంటున్నామంటున్న వైద్య ఆరోగ్య శాఖాధికారులు

జిల్లాలో అంటు వ్యాధులు డెంగ్యూ, మలేరియా జ్వరాలు ప్రబలుతున్నాయి. పారిశుధ్యం పడకేసింది. ప్రభుత్వ వైద్యం అందక ప్రైవేటు వైద్యశాలల్లో పేదలు వైద్యం చేయించుకోలేక పేద బడుగు బలహీన వర్గాల వారు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా పశ్చిమ ప్రాంతంలోని పలు గ్రామాలు మంచం పట్టారు. ఏ ఇంటిలో చూసిన ఒకరిద్దరు జ్వరాలతో బాధపడుతున్నారు. ప్రభుత్వ వైద్యశాలల్లో సరైన వైద్యం అందక ప్రైవేటు వైద్యశాలలకు పరుగులు తీయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇదే అదునుగా కార్పొరేట్ వైద్యుల పేదల దగ్గర వేలకు వేలు దండుకుంటున్నారు.

విశాలాంధ్ర బ్యూరో-ఒంగోలు : వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు వచ్చాయి. తుపాను ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురిసాయి. దీంతో పారిశుద్ధ్యం ఎక్కడికక్కడ పడకేసింది. దీంతో అంటు వ్యాధులు డెంగ్యూ,

మలేరియా లాంటి విష జ్వరాలు ప్రబులుతున్నాయి. ప్రభుత్వ వైద్యశాలలో సరైన వైద్యసేవలు అందకపోవడంతో ప్రైవేటు వైద్యశాలలను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ముఖ్యంగా గిరిజన తాండాల్లో అంటు వ్యాధుల ప్రభావం ఎక్కువగా ఉంది. గత వారం రోజుల నుంచి తుఫాను ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురిసాయి. దీంతో శివారు ప్రాంత కాలనీలు, లోతట్టు ప్రాంతాలు అంతా బురదమయం అయ్యాయి. పలుచోట్ల కాలనీల్లోకి వర్షపునీరు చేరాయి. దీనికి తోడు పారిశుద్ధ్యం సక్రమంగా లేకపోవడంతో జిల్లాలో వ్యాధులు ప్రబలుతున్నాయి. జిల్లా కేంద్రమైన ఒంగోలుతో పాటు గిద్దలూరు, యర్రగొండపాలెం, కనిగిరి, మార్కాపురం నియోజకవర్గాల్లోని పలు మండలాల్లో అంటు వ్యాధుల ప్రభావం ఎక్కువగా ఉంది. దీంతో పేదలు వైద్యశాలల్లో వైద్యం పొందలేక ప్రభుత్వ వైద్యశాలలకు పరుగులు తీస్తున్నారు. అక్కడ కూడా సిబ్బంది అరకొరగా ఉండటం, సరైన మందులు లేకపోవడం రక్తపరీక్షకు సంబంధించి వైద్య పరికరాలు ప్రభుత్వ వైద్యశాలల్లో లేకపోవడంతో ప్రైవేటు వైద్యశాలలకు మిగతా 2 లో ...

పేదలకు నివేశన స్థలాలు ఇవ్వండి

- నిత్యావసర ధరలు తగ్గించాలి
- పేదలకు రేషన్ కార్డులు మంజూరు చేయాలి
- పట్టణంలో సీపీఐ నేతల ర్యాలీ

విశాలాంధ్ర - చీరాల : అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల శామ్యూల్ అన్నారు. భారత కమ్యునిస్టు పార్టీ దేశ వ్యాప్త ఆందోళనలో భాగంగా శుక్రవారం చీరాల పట్టణంలో పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరుతూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బత్తుల శామ్యూల్, సీపీఐ సీనియర్ నాయకులు మేడ వెంకట్రావులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం దేశ సంపదను కార్పొరేట్లకు దోచి పెడుతుందని పేదలను మరింత పెదరికంలోకి నెడుతూ ధనవంతులను మరింత ధనవంతులుగా చేస్తుందన్నారు. పేదలకు కనీస అవసరాలైన నిత్యావసరాల ధరలు ఆకాశాన్ని అంటేలా చేశారని పెట్రోల్ డీజిల్ వంట గ్యాస్ ధరలు తగ్గించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రతి పక్షంలో వుండగా తెలుగుదేశం అధినేత చంద్రబాబు పేదలకు పట్టణంలో రెండు సెంట్లు,పంచాయతీలలో మూడు సెంట్లు స్థలం కేటాయించాలని అన్నారని అధికారం వచ్చాక నేటి వరకు ఇళ్ళ లేని పేదలకు స్థలం కేటాయించలేదన్నారు. అనంతరం చీరాల డిప్యూటీ తహసీల్దార్ సురేష్‌కు వినతి పత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిరుమల ప్రకాష్,ఏఐటియుసి పట్టణ కార్యదర్శి బాసి పైడయ్యా, ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు అచ్యుతున్ని బాబురావు,చీరాల పట్టణ సీపీఐ కార్యదర్శి సైకం రాజశేఖర్, నియోజకవర్గ నాయకులు పున్నారావు ,గిరి తదితరులు పాల్గొన్నారు.

వరద..నష్టం అపారం

విశాలాంధ్ర - కొల్లూరు : కృష్ణా తీరంలో వరదలు అపార నష్టాన్ని మిగిల్చాయి. నదీ పరివాహక గ్రామాలలోని పంట పొలాలు మొత్తం వరద ముంపు భారిన పడటంతో పంటలతోపాటు, గృహాల్లోని సామాగ్రీ సైతం వరద ప్రవాహంలో మునిగి ఎందుకూ పనికిరాకుండా పోవడంతో ప్రజలు తీవ్రంగ నష్టపోయారు. కొల్లూరు మండలపరిధిలోని 22 గ్రామాలలోని పంటల నష్ట నమోదు, వరద ముంపుకు గురైన నివాసాలు, దెబ్బతిన్న నివాసాల అంచనాల రూపొందించే పనిలో ఎన్యుమరేషన్ బృంధాలు నిమగ్నమయ్యాయి. వరదల తాకిడికి గురైన పంట పొలాల్లో వరద నీరు తొలగకపోవడం, మండలపరిధిలోని తడికలపూడి, తిప్పలకట్ట గ్రామాలలో పల్లపు ప్రాంతాలలోని ఇళ్లు నేటికీ వరద నీటిలోనే ఉండటంతో నష్ట తీవ్రత పెరగడంతోపాటు, పంట కుళ్లిన వాసనలతో గ్రామాలలో దుర్గంధం వెదజల్లుతుంది. పసుపు, కంద, తమలపాకు, అరటి, జామ, బొప్పాయి, కూరగాలయ పంటలు సర్వం నీట మునగడంతో ఎందుకూ పనికిరాకుండా కుళ్లిపోయి రైతులకు ఆపార నష్టం వాటిల్లడంతో లంక గ్రామాల రైతులు మనోవేదనతో తల్లడిల్లుతున్నారు. గ్రామాలలో పారిశుద్య పనులను ప్రభుత్వ యంత్రాంగం ముమ్మరం చేసింది. వరద ప్రభావిత ప్రజలకు మంచినీటి సీసాలతోపాటు, ఆహార పొట్లాలను గ్రామాల్లో పంపిణీ చేస్తున్నారు. ముంపు గ్రామాలలో జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, బాపట్ల ఎంపీ తేనేటి కృష్ణప్రసాద్, టీడీపీ నాయకులు కనగాల మధుసూదన్ ప్రసాద్, మైనేని మురళీకృష్ణ తదితరులు పర్యటించి సహాయక చర్యలను పర్యవేక్షించారు.

ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.10 లక్షలు విరాళం

విశాలాంధ్ర-ఒంగోలు : శర్వాణి ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ చైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ పెద్దిరెడ్డి గోపాల్ రెడ్డి, జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డితో కలిసి ఈ నెల 6వ తేదీన విద్యుత్ శాఖ మాత్యులు గొట్టిపాటి రవికుమార్‌ను తాడేపల్లిలోని వారి గృహంలో కలిసి 10 లక్షల రూపాయల చెక్కును వరద బాధితుల సహాయం కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి సహాయనిధికి అందించారు. జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ప్రసంగిస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రులు, అధికార యంత్రాంగం, ప్రజా ప్రతినిధులు అహర్నిశలు కృషి చేస్తూ వరద బాధితులకు యుద్ధ ప్రాతిపదికన సహాయం అందించటం హర్షనీయమన్నారు. మానవతా దృక్పథంతో సినీ రంగ ప్రముఖులు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి వరద బాధితులను ఆదుకోవటం అభినంద నీయమన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు ఒకరోజు వేతనాన్ని ప్రకటించడం, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ 6 కోట్ల రూపాయలు అందించడం హర్షనీయమన్నారు. కేంద్ర ప్రభుత్వం వరద వలన వచ్చిన నష్టాన్ని అంచనా వేసి త్వరలో ఆర్థిక సహకారాన్ని అందిస్తుందని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

దర్శి ప్రభుత్వ ఆసుపత్రికి సీటీజీ యంత్రం బహూకరణ

విశాలాంధ్ర-దర్శి : దర్శి ప్రభుత్వ ఆసుపత్రిలో డెలివరీ సమయంలో శిశువుల జీవితాన్ని కాపాడేందుకు సిటీజి యంత్రాన్ని దర్శి తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి తన సొంత నిధులతో సమకూర్చేందుకు ముందుకు వచ్చారు. ఇటీవల ప్రభుత్వ ఆసుపత్రిలో వైరల్ జ్వరాలు కాన్పులకు అవసరమైన వసతులపై ఆమె స్వయంగా పరిశీలించి డెలివరీ సమయంలో శిశువుల ప్రాణాలు రక్షించే సిటీజి మిషన్‌ను ఆమె సొంత ఖర్చుతో సమకూరుస్తానని డాక్టర్ లక్ష్మీ తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం సిటీజి మెషిన్‌ను కొనుగోలు చేసినట్లు త్వరలో హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ సుమన్‌కు అందజేయడం జరుగుతుందని డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ తెలిపారు.

వినాయక చవితి శుభాకాంక్షలు

మాజీ మంత్రి శిద్దా రాఘవరావు

విశాలాంధ్ర-ఒంగోలు : మాజీ మంత్రి శిద్దా రాఘవరావు రాష్ట్ర ప్రజలకు వినాయక చవితి పండగ శుభాకాంక్షలు తెలియజేశారు. వినాయక చవితి పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. మీరు తలపెట్టిన ప్రతి కార్యం ఆ గణనాధుని ఆశీస్సులతో విజయం సిద్ధించాలని విఘ్నాలు కలగకుండా కాపాడాలని ఆ వినాయకుని ప్రార్ధిస్తున్నట్లు ఆయన ఆశీస్సులు మీకు మీ కుటుంబ సభ్యులకు ఉండాలని కోరుకుంటూ వినాయక చవితి పండగ సంతోషంగా జరుపుకోవాలని కోరు కుంటున్నట్లు శిద్దా రాఘవరావు ఒక ప్రకటనలో తెలిపారు.

ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన రావు

ఒంగోలు శాసన సభ్యులు,తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు దామచర్ల జనార్ధన రావు జిల్లా ప్రజలకు వినాయక చవితి పండగ శుభాకాంక్షలు తెలియజేశారు. వినాయక చవితి పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. గణనాధుని ఆశీస్సులు ప్రజలందరికీ ఉండాలని కోరుకుంటూ వినాయక చవితి పండగ సంతోషంగా జరుపుకోవాలని దామచర్ల జనార్ధన రావు ఒక ప్రకటనలో తెలిపారు.

మాజీ మంత్రి సురేష్

విశాలాంధ్ర-శింగరాయకొండ : జిల్లా ప్రజలకు కొండేపి నియోజకవర్గ నాయకులకు, కార్యకర్తలకు, అధికారులు, జగనన్న అభిమానులకు, శ్రేయోభిలాషులకు వినాయకచవితి శుభా కాంక్షలను మాజీ మంత్రి, కొండేపి నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదిమూలపు సురేష్ ఒక ప్రకటనలో తెలిపారు. సుఖ సంతోషాలతో, వినాయకుని ఆశీస్సులు ఉండాలని కోరుకున్నారు.

సేవలు వెలకట్టలేం..రుణం తీర్చుకోలేం

- ముంపు బాధితులకు నిత్యం బాసటగా నిలిచిన కలెక్టర్
- చేతులెత్తి నమస్కరిస్తున్న ముంపు గ్రామ బాధితులు
- కలెక్టర్ సేవలకు ప్రశంసలు
- వారం రోజులుగా వరద ప్రభావిత ప్రాంతాల్లోనే ఉంటూ పర్యవేక్షణ

విశాలాంధ్ర - బాపట్ల :

మీరు అందించిన సేవలకు వెలకట్టలేమని మీ రుణం తీర్చుకోలేమని వరద ముంపుకు గురైన లంక గ్రామాల ప్రజలు జిల్లా కలెక్టర్ వెంకట మురళికి చెతులెత్తి నమస్కరిస్తున్నారు. గత వారం రోజులుగా కలెక్టర్ రేయింబవళ్లు ముంపు గ్రామల్లోనే ఉంటూ ఎలాంటి సమస్యలు రానివ్వకుండా నిత్యం పర్యవేక్షణ చేస్తూ ప్రజలకు భరోసా ఇస్తూ సాయం అందించారు.

- జిల్లాలోని భట్టిప్రోలు,రేపల్లె మండలాలలోని లంక గ్రామాలలో జిల్లా కలెక్టర్ శుక్రవారం విస్తృతంగా పర్యటించారు.లంక గ్రామాలలో ప్రజల నుంచి విశేష స్పందన లభించింది.జిల్లా కలెక్టర్ వాహనం చూడగానే గ్రామస్తులు అక్కడకు చేరుకుని చేతులెత్తి దండం పెట్టారు.మీరు అందించిన సహాయం వెలకట్టలేనిదంటూ గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. వరద ముంపుతో నిరాశ్రయులైన మాకు కొండంత అండగా నిలిచి ఆహార పదార్థాలు,మినరల్ వాటర్ సమృద్ధిగా ఇచ్చి ఆదుకున్నారని కలెక్టర్‌ను ప్రశంసించారు.గతంలో ఎన్నో వరదలు చూశాము,అధికారులు సక్రమంగా స్పందించేవారు కాదు,ఇప్పుడైతే అలాంటి పరిస్థితి కనిపించలేదని గ్రామస్తులు పదే పదే చెప్పారు.ప్రస్తుతం అత్యంత వేగంగా సహాయం అందుతుందని అడుగడుగునా గ్రామస్తులు నిరాజనం పలికారు.ఏ కలెక్టర్ చేయలేనంతగా సహాయక చర్యలు గొప్పగా చేశారని వందల మంది గొంతుకలు గల మెత్తాయి.ఇప్పుడైతే సర్వం కోల్పోయిన వారిని ఆదుకుంటామంటూ భరోసా ఇవ్వడం మాకు ఎంతో ఆత్మస్థైర్యాన్ని నింపిందని గ్రామస్తులు తెలిపారు.సేవకుల్లా యంత్రాంగమంతా మీకోసం పనిచేస్తుందని జిల్లా కలెక్టర్ తెలిపారు.రేషన్ షాప్ వద్ద నిత్యవసర సరుకులను గ్రామస్తులకు పంపిణీ చేశారు.ఆధార్,రేషన్ కార్డులు వరదలో కొట్టుకుపోయాయని చింతమోటు గ్రామస్తులు కలెక్టర్‌కు విన్నవించారు.స్పందించిన కలెక్టర్ రేషన్ కార్డు లేని 20 కుటుంబాలకు నిత్యవసర సరుకులు ఇవ్వాలని తహసిల్దార్‌ను కలెక్టర్ ఆదేశించారు. ఐదెకరాలలో జామ తోట వేశానని,ఈ క్రాప్‌లో నమోదు కాలేదని కౌలు రైతు చెప్పడంతో తక్షణమే నమోదు చేస్తామని హామీ ఇచ్చారు.పశువులకు దాణా లేక ఇబ్బందులు పడుతున్నామని పశుపోషకులు కలెక్టర్‌కు వివరించారు.బాపట్ల జిల్లాలో 90 రైస్ మిల్లులు ఉండగా వారితో మాట్లాడి 20 టన్నుల పశువుల దాణా కింద తౌడు అందిస్తామని చెప్పారు.అది గాకుండా సంగం డెయిరీ నుంచి ఒక్కొక్కరికి 25 కేజీలు చొప్పున పశువుల దాణా వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు.గృహాలు నష్టపోయిన వారికి తక్షణమే పరిహారం అందిస్తామని కలెక్టర్ వెంకట మురళి చెప్పారు. గృహం పూర్తిగా నష్టపోతే రూ.1,25,000లు పరిహారం వస్తుందన్నారు. పెదలంకలో 427 కుటుంబాలు ఉండగా,1276 మంది ప్రజలు జీవనం సాగిస్తున్నారని నష్టపోయిన కుటుంబాలకు సహాయం అందించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారన్నారు.మీ అందరికీ నాణ్యమైన భోజనం,తాగునీరు,అల్పాహారం,కేకులు,బిస్కెట్లు వచ్చాయా అంటూ ఆరా తీశారు.పోలేరు వద్ద మురికివాగు దిగువకు వెళ్లకుండా మట్టితో పూడ్చడంతో వరద నీరు గ్రామం నుంచి బయటకు వెళ్లడం లేదని గ్రామస్తులు ఆయన దృష్టికి తెచ్చారు.తక్షణమే తొలగించాలని ఆర్డీవోను ఆదేశించారు.భారీ వర్షాలు వరదతో ఈనెల పింఛన్ 33 మందికి రాలేదని లబ్ధిదారులు విన్నవించడంతో ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు.రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాలతోనే యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టామని కలెక్టర్ తెలిపారు.వరద బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు.ఓలేరు పల్లెపాలెంలో కృష్ణానది వరద ప్రవాహంతో 50 మీటర్ల వెడల్పున 50 ఎకరాలు కోతకు గురయ్యాయని గ్రామస్తులు తెలిపారు.కోతకు గురైన భూములను పరిశీలించారు. నది ఒడ్డున పూర్తిగా దెబ్బతిన్న వల్లభనేని నాంచారమ్మ నాగేశ్వరరావు గృహాన్ని పరిశీలించారు.ఆ కుటుంబానికి తక్షణమే నివేశ స్థలం కేటాయించాలని తహసిల్దార్‌ను ఆయన ఆదేశించారు.దెబ్బతిన్న మొక్కజొన్న,బొప్పాయి తదితర పంటలను ఆయన పరిశీలించారు.నష్టపోయిన వారందరికీ పరిహారం వస్తుందని భరోసా ఇచ్చారు.లంకలోని గ్రామస్తులకు అంటువ్యాధులు సంక్రమించకుండా వైద్యాధికారులు నాణ్యమైన వైద్యం అందించాలని కలెక్టర్ ఆదేశించారు.రేపల్లె మండలం పెనుమూడి వారధి పక్కనే ఉన్న పల్లెపాలెంలో పర్యటించారు. పల్లెపాలెంలో పూర్తిగా నేలకొరిగిన సుబ్బారావు సుజాత గృహాన్ని కలెక్టర్ పరిశీలించారు.మీకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.నష్ట పరిహారం ఇస్తామని,నూతన గృహ నిర్మాణానికి నగదు ఇస్తామని కలెక్టర్ తెలిపారు.పైపులైన్ ద్వారా వచ్చే తాగునీటిని కాచి వడ కట్టుకొని తాగాలని సూచించారు. డయేరియా వంటి ప్రాణాంతక వ్యాధుల రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.బోట్లు,వలలు దెబ్బతిన్న వారికి పరిహార చెల్లిస్తామని వారికి హామీ ఇచ్చారు.ఆయన వెంట ఆర్డిఓ హేలా షారోన్,గృహ నిర్మాణ శాఖ పిడి ప్రసాద్, పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ హనుమంతరావు తదితరులు ఉన్నారు.

ప్రబలుతున్న రోగాలు

(మొదటిపేజీ తరువాయి)

వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో ప్రైవేటు వైద్యులు వచ్చిన వారి నుంచి ఆ టెస్టులు, ఈ టెస్టులు అంటూ రకరకాల పేర్లతో వేలకు వేలు దండు కుంటున్నారు. చిన్నపాటి జ్వరం వచ్చి వైద్యశాలకు వెళ్తే టైఫాయిడ్, మలేరియా, డెంగ్యూ వంటి టెస్టులతో పాటు యూరిన్ వంటి పరీక్షలు, ఇతర పరీక్షలు అంటూ రెండు వేల నుంచి ఐదు వేల వరకు రక్తపరీక్షలకు రాస్తున్నారు. అనివార్యంగా పరీక్షలు చేయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వ వైద్యశాలల్లో సరైన వైద్య పరికరాలు లేనందునే ఎక్కువ మంది ప్రజలు ప్రైవేటు వైద్యశాలలకు వెళ్లాల్సిన పరిస్థితి జిల్లాలో ఏర్పడింది. డెంగ్యూ జ్వరంతో ప్లేట్‌లేట్స్ తగ్గుతున్నాయన్న నెపంతో వచ్చిన ప్రతి రోగికి పలు రకాల టెస్ట్‌లు చేస్తున్నారు. జిల్లా కేంద్రమైన ఒంగోలులో ప్రతి ప్రైవేటు హాస్పటల్‌లో రోగులు బారులు తీరుతున్నారు. కొంతమంది అయితే హైదరాబాదు, చెన్నై వంటి సుదూర ప్రాంతాల్లోని కార్పొరేట్ వైద్యశాలల్లో చేరుతున్నారు. ఒంగోలు రిమ్స్‌లో సరైన పరికరాలు లేకపోవడం రోగులకు శాపంగా మారింది. పేరుకే వంద పడకల హాస్పటల్ అయినప్పటికీ ఇక్కడ వైద్యంపై ప్రజలకు నమ్మకం సన్నగిల్లుతుంది.

పల్లెల్లో పడకేసిన పారిశుద్ధ్యం :

గత వారం రోజుల నుంచి జిల్లాలో కురుస్తున్న వర్షాలకు గ్రామాల్లో పారిశుద్ధ్యం, అస్తవ్యస్తంగా ఉంది. చెత్త చెదారం ఎక్కడంటే అక్కడ దర్శనం ఇస్తున్నాయి. కాలువల్లో పూడికలు కూడా సక్రమంగా తీయకపోవడంతో దోమలకు ఉత్పత్తి కేంద్రాలుగా మారాయి. దీంతో అంటువ్యాధులు ప్రబలుతున్నాయి. ప్రతి ఇంటిలో ఒకరికి, ఇద్దరికి జ్వరాల బారినపడి మంచంపట్టారు.

గ్రామాల్లో వైద్యసేవలు అందుబాటులో లేకపోవడంతో పట్టణ ప్రాంతాలకు పరుగులు తీయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా పంచాయితీల్లో పారిశుద్ధ్య పనులు వేగవంతం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

అదును చేసి సొమ్ము చేసుకుంటున్న ప్రైవేటు వైద్యులు

జిల్లా వ్యాప్తంగా డెంగ్యూ, మలేరియా జ్వరాలు ప్రబలి ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ వైద్యశాలల్లో సరైన వైద్య సేవలు అందుబాటులో లేకపోవడంతో పట్టణ ప్రాంతాల్లోని ప్రైవేటు వైద్యశాలలకు పరుగులు తీస్తున్నారు. అక్కడికి వెళ్లే రకరకాల రక్తపరీక్షల పేర్లతో ప్రజల నుంచి వేలకు వేలు లాక్కొంటున్నారు. పేదల వైద్యాన్ని బలహీనతగా మార్చుకుంటున్న వైద్యులు వారి వద్ద నుంచి వేలకు వేలు దండుకొని కోట్లు గడిస్తున్నారు. ఇదేమిటని అడిగే నాధుడు లేకపోవడం, ప్రభుత్వ అధికారుల పరిశీలన అసలు ఉండకపోవడంతో ప్రైవేటు వైద్యశాలల్లో పేదల రక్తాన్ని జలగల్లా పీల్చుకుతింటున్నారు.

పర్యావరణ పరిరక్షణకు విద్యార్థుల ర్యాలీ

విశాలాంధ్ర-టంగుటూరు : వినాయక చవితి సందర్భంగా పర్యావరణాన్ని నాశనం చేసే విగ్రహాలను కాకుండా మట్టితో చేసిన వినాయక ప్రతిమలతో పండగ జరుపుకొని నీటి కాలుష్యాన్ని అరికట్టాలని మండలం లోని టంగుటూరు ఉన్నత పాఠశాల, వల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు వినూత్న కార్యక్రమాలను శుక్రవారం చేపట్టారు.

టంగుటూరులో : నేషనల్ గ్రీన్ కార్ప్ సొసైటీ డైరెక్టర్ ఉత్తర్వుల మేరకు గ్రీన్ స్కూల్ డ్రైవ్ లో భాగంగా శుక్రవారం గవర్నమెంట్ హై స్కూల్ టంగుటూరు విద్యార్థులు, ఉపాధ్యాయ సిబ్బంది టంగుటూరు గ్రామంలో పర్యవరణ పరిరక్షణ కొరకు ర్యాలీ చేపట్టారు. మసీద్ సెంటర్లో విద్యార్థులు మానవహారం నిర్వహించి వినాయక చవితి పండుగలు మట్టితో తయారుచేసిన వినాయకుని బొమ్మలు ఉపయోగించి పర్యావరణాన్ని కాపాడాలని తద్వారా నీటి కాలుష్యాన్ని కూడా అరికట్టవచ్చని విద్యార్థులు పిలుపునిచ్చారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పివిఎస్‌తులసి ప్రభ వ్యాయమ ఉపాధ్యాయిని ఎన్.అరుణ పాల్గొన్నారు.

వల్లూరులో : వినాయక చవితి పండుగ నాడు మట్టి వినాయకుని మాత్రమే పూజించాలని స్థానిక వల్లూరు ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు వినూత్న ప్రయోగం చేశారు. విద్యార్థినీ విద్యార్థులకు పంచదమే కాకుండా పండుగను పర్యావరణ హితంగా జరుపుకోవాల్సిన విధానంను వారికి తెలియజేశారు. వారి చేత స్వహస్తాలతో విగ్రహాలను తయారు చేయించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యా యులు మందాటి రమణయ్య జీవశాస్త్ర ఉపాధ్యాయిని నివేదిత సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు గోపాల్ రెడ్డి మహేష్ రావు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహార మాసోత్సవాలు

విశాలాంధ్ర-పుల్లలచెరువు : పుల్లలచెరువు మండలంలోని యండ్రపల్లి గ్రామంలో అంగన్వాడీ సెంటర్లో పౌష్టికాహార మాస ఉత్సవాలు నిర్వహించారు. ఈ సమావేశంలో హెూమియోపతి డాక్టర్ యాకోబు మాట్లాడుతూ మంచి పోషక విలువలున్న జొన్నలు, సజ్జలు వీటిని నానపెట్టిన మొలకలు తినాలని తెలియజేశారు. ఎక్కువగా ఆకుకూరలు, క్యారెట్, బీట్రూట్ తీసుకోవాలని చెప్పారు.

ఎస్ఐగా బాబురావు

విశాలాంధ్ర-పుల్లలచెరువు : పుల్లలచెరువు ఎస్ఐగా బత్తుల బాబురావు నియమితులయ్యారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పదవీ బాధ్యతలు చేపట్టారు. ఎస్ఐ మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. తెలుగుదేశం పార్టీ నాయకులు ఎంపీటీసీ మేడికొండ రాధాకృష్ణ టిడిపి నాయకులు గజ్వేల్ భాస్కరరావు జనసేన పార్టీ నాయకులు ఆకుల వెంకటేశ్వర్లు ఎం.మల్లయ్య పాల్గొన్నారు.

అన్నదాన సత్రాలు మూసివేత

విశాలాంధ్ర-రాచర్ల : మండలంలోని జేపీ చెరువు అటవీ ప్రాంతంలో వెలసి ఉన్న శ్రీ నెమలిగుండ్ల రంగనాయక స్వామి దేవస్థానంలో ఉన్న శ్రీకృష్ణ దేవరాయ కాపు బలిజ సత్రంలో శనివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించడం లేదని సత్ర నిర్వాహకులు కన్నసాని గోపాల్ రావుతోట చంద్రయ్యలు తెలిపారు. తుఫాను అధిక వర్షాల కారణంగా శనివారం సత్రాన్ని మూసివేస్తున్నట్లు వారు తెలిపారు. ప్రతి శనివారం ప్రత్యేక పూజలు సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఈ శనివారం తుఫాను కారణంగా కార్యక్రమాన్ని నిర్వహించడం లేదని వారు తెలిపారు భక్తులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

దోమలు నివారణకు చర్యలు

విశాలాంధ్ర-పెద్దదోర్నాల : చింతల ప్రాథమిక ఆరోగ్య కేంద్రము వైద్యాధికారి డాక్టర్ యం యగ్నిక్ ఆధ్వర్యంలో పెద్ద దోర్నాల అపార్ట్మెంట్ పరిసర ప్రాంతాలలో నీరు నిలువ ఉన్న ప్రాంతాలలో దోమల లార్వా వృద్ధి చెందకుండా ఆయిల్ బాల్స్, అబెట్ ఆయిల్‌ను వేయటం జరిగినది. శుక్రవారం పరిసర ప్రాంతాలలో నీరు నిలవ ఉన్నచోట చెల్లించడం జరిగింది. వైద్యాధికారి వాతావరణం మార్పు వలన అంటూ వ్యాధులు పెరిగే అవకాశం ఉన్నది. ఈ కార్యక్రమంలో పి.హెచ్.యన్ పి.సూర్య కుమారి, సబ్ యూనిట్ ఆఫీసర్ సి.హెచ్.రమేష్ బాబు, యం.యల్.హెచ్.పి యన్.సౌజన్య, హెల్త్ అసిస్టెంట్ ఏ.భరత్ భూషణ్, ఏ.యన్.యం కే.నాగలక్ష్మి, ఆశా కార్యకర్తలు వై.రాణీ, పి.రానెమ్మ, కే.పి బాలనాగమ్మ, కే ప్రావిన్యలు పాల్గొన్నారు.

రమణమ్మ మృతికి సంతాపం

విశాలాంధ్ర-వెలిగండ్ల : మరపగుంట్ల గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త రమణమ్మ గురువారం రాత్రి ఆకస్మికంగా మరణించడం జరిగింది విషయం తెలుసుకున్న మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ముత్తిరెడ్డి వెంకటరెడ్డి కనిగిరి నియోజకవర్గ రైతు అధ్యక్షుడు కేలం ఇంద్ర భూపాల్ రెడ్డి శుక్రవారం ఉదయం రమణమ్మ భౌతిక కాయాన్ని సందర్శించి నివాళు లర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియ జేశారు. వారి వెంట ఒంగోలు శీను, ముత్తిరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, కొండారెడ్డి, అడ్వకేట్ బాల నారాయణ, కుటుంబ సభ్యులను పరామర్శించారు.

మట్టి విగ్రహాలను వినియోగిద్దాం

విశాలాంధ్ర-గిద్దలూరు : పట్టణంలోని రేడియో బావి సెంటర్లో గల ఆంజనేయ స్వామి ఆలయం వద్ద వినాయక చవితి పండుగ సందర్భంగా మట్టి వినాయక ప్రతిమలను హిందూ ధార్మిక సంఘాలు పంపిణీ చేశాయి. ముఖ్యఅతిథిగా హాజరైన గిద్దలూరు అర్బన్ సీఐ సురేష్ ఈ సందర్భంగా ఆయనను దృశ్యాలువాతో సత్కరించిన దేవాలయ కమిటీ సభ్యులు. సురేష్ మాట్లాడుతూ ఇప్పటికే పర్యావరణ కాలుష్యం వలన పలు విపత్తులను మనం చూస్తున్నామని పర్యావరణాన్ని రక్షించు కోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని సూచించారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలను వినియోగించకుండా మట్టి విగ్రహాలని వినియోగించి ఆ గణనాథుని కృపకు పాత్రులు కావాలని అన్నారు. వినాయక చవితి పర్వదినం సందర్భంగా ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేశారు.

డిప్యూటీ డీఎంహెచ్‌ఓను కలిసిన బీజేపీ నాయకులు

విశాలాంధ్ర-గిద్దలూరు : గవర్నమెంట్ హాస్పిటల్స్ పరిశీలనకు వచ్చిన డిప్యూటీ డి ఎం హెచ్ ఓ పద్మావతిని గిద్దలూరు అర్బన్ హెల్త్ సెంటర్ నంద్యాల రోడ్‌లో గల గవర్నమెంట్ హాస్పిటల్ నందు పట్టణ బీజేపీ అధ్యక్షులు అపి సెట్టి ఉదయ్ శంకర్ ఆధ్వర్యంలో మర్యాద పూర్వకంగా కలిసి వారిని శాలువాతో సన్మానించడం జరిగింది. వారికి హాస్పిటల్స్‌లో సీజనల్ వ్యాధులు ఎక్కువ వున్నాయి కనుక మందుల కొరత లేకుండా చూడాలని, ఈ ప్రాంత ప్రజలు ఆర్థికంగా వెనకబాటుతో బయట మందులు కొనుగోలుతో ఇబ్బంది పడకుండా చూడాలని కోరడం జరిగింది. స్పందించిన డీఎంహెచ్ఓ పద్మావతి మాట్లాడుతూ ఎంఎల్ఏ దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరిస్తామని తెలియచేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా బీజేపీ ఉపాధ్యక్షులు భవనాసి వెంకట రామాంజనేయులు, జిల్లా అధికార ప్రతినిధి డాక్టర్ జెవి నారాయణ, జిల్లా ఓబిసి కార్య వర్గ సభ్యులు వీర చక్రము, గిద్దలూరు పట్టణ జనరల్ సెక్రటరీ మునగ నూరి రామకృష్ణ, పట్టణ బిజెవైఎం అధ్యక్షులు అల పాటి సాయి చరణ్, సీనియర్ నాయకులు మారుతి ప్రసాద్, పట్టణ బిజెవైఎం ఉపాధ్యక్షులు సంతోష్ కుమార్ పాల్గొనడం జరిగింది.

కనకదుర్గమ్మను దర్శించుకున్న తిరుపతిరెడ్డి

విశాలాంధ్ర-వెలిగండ్ల : ప్రకాశం జిల్లా జడ్పిటిసిల సంఘం అధ్యక్షులు వెలిగండ్ల జెడ్పిటిసి గుంటక తిరుపతిరెడ్డి శుక్రవారం ఉదయం బెజవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న కనకదుర్గమ్మ అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు అమ్మవారి ప్రసాదం అందించి ఆశీర్వదించారు. జడ్పిటిసి గుంటక తిరుపతిరెడ్డి మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులు విజయవాడ ప్రజలపై ఉండాలని విజయవాడ ప్రజలను వరదలనుండి కాపాడి, చల్లగా చూడాలని అమ్మవారికి మొక్కున్నట్లు తెలిపారు ఆయన వెంట కొండ నాగార్జున రెడ్డి, నాగేశ్వరరావు తదితరులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు

విశాలాంధ్ర-పెద్దదోర్నాల : దోర్నాల మండలంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నందు జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వి నాగమహేశ్వరి మాట్లాడుతూ నేత్రదానం కర్నియా దానం చేయటం ద్వారా ఇద్దరికీ కంటిచూపు ప్రసాదించవచ్చు. ఎవరైనా నేత్రదానం చేయవచ్చు. అదృష్టవశాత్తు పోగొట్టుకున్న కంటి చూపును చికిత్స ద్వారా తిరిగి పొందవచ్చునని తెలియజేశారు. అలాగే డాక్టర్ సంజీవ్ మాట్లాడుతూ మనిషి మరణించిన 6 గంటల్లోపు నేత్రాలను తీయవలసి ఉంటుంది అని అన్నారు. డాక్టర్ వి నాగమహేశ్వరి, డాక్టర్ టి వైద్య సంజీవ్ డాక్టర్ లావణ్య, డాక్టర్ కళా సంధ్య, ఆప్తమాలిక్ అసిస్టెంట్ కవిత, హెడ్ నర్సు ఎలిజబెత్, ఆరోగ్య మిత్రులు. మందగిరి చంద్రశేఖర్ సంగటి మణికుమార్, నర్సులు హాస్పటల్ సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయాల ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర-వెలిగండ్ల : మండలంలోని ఇమ్మడి చెరువు, రామ గోపాలపురం, గుడిపాటిపల్లి సచివాలయాలను ఈవోపీఆర్డీ తాతపూడి సుకుమార్ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పలు రికార్డులను పరిశీలించారు. ఉద్యోగుల హాజరు దస్త్రాలను పరిశీలించారు ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం అర్హులకు సంక్షేమ పథకాలు అందజేయాలని ప్రజా సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు సచివాలయ పరిధిలో శాఖల వారీగా జరిగే పథకాల పనితీరు గురించి అడిగి తెలుసుకున్నారు ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పద్మజ, షకీలా, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మహారాజశ్రీ మార్కాపురం అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో

E.A. 1/2021 in O.S. 18/2015

చెన్నుశెట్టి శశికుమార్ --D.H.R.

Vs

అమ్మనబ్రోలు మస్తానమ్మ మరియు ఇతరులు -- J.D.Rs

To : R3 : కోళ్ళం రాజేశ్వరి, భర్త సత్యరాజు హిందువు, గృహిణి, డోర్.నెం. 51-1-177బి, కబాడిపాలెం ఒంగోలు.

పై నెంబరు E.P. నందు మీకు కోర్టువారి నుండి or 21 R 34 CPC నోటీసులు ఎన్ని పర్యాయములు పంపినను తీసుకొనకుండా కాలయాపన చేసియున్నారు. కావున కోర్టువారు పేపరు ప్రకటన ద్వారా or 21 R 34 CPC నోటీసులు జారీ చేయమని ఆర్డర్ వేసియున్నారు. కావున మీకు ఏమైన ఆక్షేపణలు ఉన్న యెడల వాయిదా 13-09-2024వ తేదీ ఉదయం 10.30 ని॥లకు స్వయంగా కాని లేదా వకీలు ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొన గలరు. లేనియెడల మీ పరోక్షమందు విచారణ చేసి తీర్మానించబడునని ఖండితముగా తెలియజేయడమైనది.

(కోర్టువారి ఉత్తర్వులతో)

వాయిదా తేది : 13-09-2024

R.V.Nageswara Sastry, Advocate
Markapur- 523 316. A.P.
Cell : 9490442468, 9849323181

మహారాజశ్రీ మార్కాపురం అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో

E.A. 16/2022 in E.P. 4/2020
in O.S. 94/2011

పిన్నిక మధుసూధనరావు -- పిటీషనర్/D.H.R.

Vs

షేక్ గౌస్ బాషా మరియు ఇతరులు -- రెస్పాండెంట్లు/J.D.Rs

To : R4 : షేక్ నజియా, తండ్రి పీరుల్ల బిక్షు, ముస్లిం, R/o C/o షేక్ మాబు, ఫైనాన్స్ వ్యాపారం, మల్లిపురం ఖాదర్‌వలి దర్గా ఎదురు, యర్రజోతు లక్ష్మి శ్రీనివాస హాస్పిటల్, లక్ష్మీశెట్టిపాలెం, పొదిలి గ్రామం మరియు మండలం

పై సంబరు E.A. నందు 4వ రెస్పాండెంటు అయిన మీకు కోర్టువారి ద్వారా ఎన్ని పర్యాయములు LRS నోటీసులు పంపినను తీసుకొనకుండా కాలయాపన చేసినందున కోర్టువారు పేపరు ప్రకటన ద్వారా నోటీసులు జారీ చేయమని ఆర్డర్ వేసియున్నారు. కావున మీకు ఏమైన ఆక్షేపణలు ఉన్న యెడల వాయిదా ది.25-09-2024వ తేదీ ఉదయం 10.30 ని॥లకు స్వయంగాకాని లేదా వకీలు ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేని యెడల మీ పరోక్షమందు విచారణ చేసి తీర్మానించ బడునని ఖండితముగా తెలియజేయడమైనది.

(కోర్టువారి ఉత్తర్వులతో)

వాయిదా తేది : 25-09-2024

R.V.Nageswara Sastry, Advocate
Markapur- 523 316. A.P.
Cell : 9490442468, 9849323181

వినాయక చవితి శుభాకాంక్షలు

ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి

విశాలాంధ్ర-ఒంగోలు : మట్టితో చేసిన విఘ్నేశ్వరస్వామిని 9 రోజులపాటు జిల్లా ప్రజలందరు ఇండ్లలోను సామూహికంగాను నిష్టతో పూజించి, ఈ పండుగను సాంప్రదాయ బద్ధంగా జరుపుకోవాలని ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి కోరారు. ప్రజలకు వినాయకచవితి పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్లు శ్రీనివాసులురెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

దర్శి డీఎస్పీ లక్ష్మి నారాయణ

విశాలాంధ్ర-త్రిపురాంతకం : గ్రామంలో వినాయకుని విగ్రహ ఏర్పాటుకు అనుమతులు తప్పని సరి అని దర్శి డీఎస్పీ లక్ష్మి నారాయణ తెలిపారు. త్రిపురాంతకం శివాలయం వద్ద మొక్కలు నాటారు. అనంతరం త్రిపురాంతకం పోలీస్ స్టేషన్ సందర్శించారు. సిఐ సుబ్బారావు, యస్ఐ శివ బసవరాజుకి తగు సూచనలు చేశారు. అక్కడ వున్న వినాయక విగ్రహ నిర్వాహకులతో మాట్లాడారు. విగ్రహాలను ఏర్పాటు చేసే నిర్వాహకులు విద్యుత్, పోలీస్, అనుమతులు తప్పక తీసుకోవాలని సూచించారు. ఏర్పాటు సమయం నుండి నిమ్మజ్జనం వరకు కమిటి పర్యావేక్షన తప్పని సరి అన్నారు. విగ్రహం వద్ద వివాదాలకు తావు లేకుండా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐ సుబ్బారావు, యస్ ఐ శివ బసవరాజు,గ్రామాల విగ్రహ కమిటీ సభ్యులు వున్నారు.

మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు

విశాలాంధ్ర-సీఎస్‌పురం : కనిగిరి నియోజకవర్గ ప్రజలకు మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు వినాయక చవితి పండగ శుభాకాంక్షలు తెలియజేశారు. వినాయక చవితి పండుగను కుటుంబ సభ్యులతో కలిసి భక్తి శ్రద్ధలతో సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. మీరు తలపెట్టిన ప్రతి కార్యం ఆ గణనాధుని ఆశీస్సులతో విజయం సిద్ధించాలని, ఆయన ఆశీస్సులు మీకు మీ కుటుంబ సభ్యులకు ఎల్లవేళలా ఉండాలని గణనాధుణ్ని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.

జడ్పీటీసీల సంఘం అధ్యక్షుడు గుంటక తిరుపతిరెడ్డి

విశాలాంధ్ర-వెలిగండ్ల : ప్రకాశం జిల్లా జడ్పిటిసిల సంఘం అధ్యక్షుడు వెలిగండ్ల జడ్పిటిసి గుంటక తిరుపతిరెడ్డి మండల ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేశారు. శనివారం వినాయక చవితి పండుగను మండలంలో ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. మీరు తలపెట్టిన ప్రతి కార్యం ఆ గణనాధుని ఆశీస్సులతో విజయం సిద్దించాలని విఘ్నాలు కలగకుండా కాపాడాలని ఆ వినాయకుని ప్రార్థిస్తున్నట్లు ఆయన ఆశీస్సులు మీకు మీ కుటుంబ సభ్యులకు ఎల్లవేళలా ఉండాలని కోరుకుంటూ వినాయక చవితి పండగ సంతోషంగా జరుపుకోవాలని కోరుకుంటున్నట్లు ఆయన తెలిపారు.

పువ్వాడి నాగరాజు

విశాలాంధ్ర-పీసీపల్లి : పీసీపల్లి మండల ప్రజలకు తెలుగుదేశం పార్టీ నాయకులు పువ్వాడి నాగరాజు వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేశారు. నాగరాజు మాట్లాడుతూ వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలను మండల ప్రజలు భక్తి శ్రద్ధలతో ఆనందోత్సాహాలతో ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని తెలిపారు.ప్రజలకు ఎలాంటి విఘ్నాలు కలగకుండా సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో కలకాలం వర్ధిల్లాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు. వాతావరణ కాలుష్యాన్ని నివారించేందుకు అందరూ మట్టితో తయారు చేసిన ప్రతిమలను వినియోగించాలని విజ్ఞప్తి చేశారు.

మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్

విశాలాంధ్ర-పామూరు : కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ నియోజకవర్గ ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరూ మట్టి ప్రతిమలను పూజించాలని, ప్రకృతిని రక్షించి పర్యావరణాన్ని కాపాడాలని కోరారు. నియోజకవర్గంలోని ప్రతి ఒక్క కుటుంబం వినాయక చవితి పండుగను ఆనందంగా, ఆహ్లాదంగా జరుపుకోవాలని, దారపనేని చంద్రశేఖర్ ఆకాంక్షించారు.

వరద బాధితులకు రూ.60 వేల విరాళం

సీపీఐ నాయకులు పీవీఆర్ చౌదరి

విశాలాంధ్ర-ఒంగోలు : భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర సమితి పిలుపుమేరకు విజయవాడ ముంపు, వరద బాధితులకు సహాయార్థం ఒంగోలు నగర సమితి ఆధ్వర్యంలో రెండు రోజులపాటు 60వేల రూపాయలు విరాళాలు సేకరించి భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర వరద బాధితుల సహాయనిధికి అందజేయడం జరుగుతుందని సీపీఐ ఒంగోలు నగర సమితి కార్యదర్శి పీవీఆర్ చౌదరి తెలిపారు. శుక్రవారం మల్లయ్య లింగం భవనంలో పత్రికా విలేకరుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయవాడ నగరం ఎఅల్లకల్లోలమై మునిగిపోయి ధనికులు పేదలనే తేడా లేకుండా ఆడ మగ ఇల్లు, వాకిలి గొడ్డు గోదా వరదకు కొట్టుకుపోయి కట్టుకున్న బట్టలతో నిరాశ్రయులైన ప్రజలకు మానవతా దృక్పథంతో ఆదుకోవాలన్నారు. ప్రజలు మంచిగా స్పందించారని ఇలాంటి ఆపత్కాలంలో ప్రతి మనిషి తమకు తోచిన సహాయం అందజేసారన్నారు. ఏదేమైనా ప్రధానంగా బుడమేరు ఉప్పొంగడం గాని ఆక్రమణలు చేయటం వల్ల భవిష్యత్తులో కూడా విజయవాడకు ముంపు పొంచి ఉందని అన్నారు. మనం ఇచ్చే ఉడతా భక్తి సాయంగా మరి అంత గా సాయం చేయాలని కోరారు. ఈ నిధి సేకరణలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు శ్రీరామ్ శ్రీనివాసరావు, ఇన్సాఫ్ నాయకులు సలార్, సీనియర్ నాయకులు యు.ప్రకాష్ రావు, బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కే అంజయ్య, కారుమూడి నాగేశ్వరరావు, పివి కృష్ణారావు, పాటికొండ సిద్దయ్య, రామినేని శివ నాగేశ్వరావు, ఎస్ డి సర్దార్, బూదూరి హరికృష్ణ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలి

విశాలాంధ్ర-ముండ్లమూరు : గత ప్రభుత్వంలో 2019-2024లో ఇంటి నిర్మాణాలు వివిధ దశల్లో నిలిచిపోయిన వాటిని పూర్తి చేయాలని మండల హౌసింగ్ ఏఈ సిహెచ్ హనుమంతరావు అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో శుక్రవారం ఉపాధి సిబ్బంది ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 2019- 2024 వరకు ఎవరైతే ఇంటి నిర్మాణాలు మధ్యలో ఆగిపోయిన వాటిని వంద రోజులలో పూర్తి చేస్తే బిల్లులు మంజూరు చేస్తామన్నారు. 2014 నుంచి 2019 వరకు ఎన్టీఆర్ హౌసింగ్ స్కీమ్ కింద ఇల్లు నిర్మించుకొని రావలసిన బకాయిల విడుదల కోసం ప్రత్యేక యాప్‌లో ఇంటి నిర్మాణ దశను నమోదు చేయడం జరుగుతుందన్నారు. అదే విధంగా ఇల్లు మంజూరైన వారు 90 రోజులపాటు ఇంటి వద్ద పనులు చేసుకుంటే ఉపాధి ద్వారా ఇద్దరికీ ఉపాధి మస్టర్లు వేస్తారన్నారు.

హెచ్ఐవీపై అవగాహన

విశాలాంధ్ర-మార్కాపురం : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆదేశాల మేరకు హ్యాండ్స్ ఆఫ్ కంపాషన్ సంస్థచే స్థానిక మెప్మా కార్యాలయంలో శుక్రవారం హెచ్ఐవి ఎయిడ్స్'పై అవగాహన కార్యక్రమం జరిగింది. సంస్థ ప్రాజెక్టు మేనేజర్ కటికల విజయ కుమారి మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధి అనేది అంటూ వ్యాధి కాదని అంటించుకునే వ్యాధి అని తెలుపుతూ హెచ్ఐవి వ్యాధి ఎలా వ్యాప్తి చెందుతుందో తెలిపారు. వ్యాధి సోకిన వ్యక్తి పట్ల సమాజములో చిన్న చూపు చూడకుండా, వ్యాధి బారిన పడిన రోగుల పట్ల కలిసి జీవించడం ద్వారా ఏ విధంగా వ్యాధి బారిన పడకుండా మెలగాలో తెలిపారు. ఈ వ్యాధికి నివారణ ఒక్కటే మార్గమని ఎలాంటి చికిత్స లేదని తెలిపారు. ప్రభుత్వ వైద్యశాలకు చెందిన ఐ.సి.టి.సి. కౌన్సిలర్లు రాజు, అరుణలు మాట్లాడుతూ హెచ్ఐవి ఎయిడ్స్ పట్ల వైస్‌తో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరు అవగాహన కల్పించుకోవడం ద్వారా భవిష్యత్తు'పై భరోసాతో బ్రతుకుతూ చెడు వ్యసనాలకు లోను కాకుండా జీవించగలుగుతారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెప్మా అధ్యక్షురాలు, ఆర్పీలు, హెచ్.ఓ.సి.లు పాల్గొన్నారు.

మట్టి విగ్రహాలను పూజించాలి

పాఠశాల కరస్పాండెంట్ బందుగుల నారాయణరెడ్డి

విశాలాంధ్ర-కొమరోలు : పట్టణంలోని ఎస్బిఎస్ఆర్ఎం ఎయిడెడ్ పాఠశాలలో వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని ముందు రోజైన శుక్రవారం వేడుకలను పాఠశాల కరస్పాండెంట్ బందుగుల నారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. నారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పర్యావరణ కాలుష్యాన్ని నివారించటానికి మట్టి విగ్రహాలను పూజించాలని తెలిపారు. చిన్నారులచే మట్టి విగ్రహాలు తయారు చేపించి ప్రదర్శనకు ఉంచారు. చక్కగా మట్టి విగ్రహాలను తయారుచేసిన చిన్నారులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బి.వి సుబ్బారెడ్డి, ప్రిన్సిపల్ రేవతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా పౌష్టికాహారోత్సవం

విశాలాంధ్ర-నాగులుప్పలపాడు : పిల్లలకు ఏడో నెల నుండి మూడు సంవత్సరాల లోపు పౌష్టిక ఆహారం ఇవ్వవలసిన అవసరం ఎంతగానో ఉందని ఐసిడిఎస్ సూపర్వైజర్ ప్రమీల తెలిపారు. శుక్రవారం మండలంలోని ఉప్పుగుండూరు గ్రామంలో జరిగిన పౌష్టిక ఆహార మహోత్సవాల్లో ఆమె మాట్లాడుతూ 7 నెలలు దాటిన పిల్లలకు చిరుధాన్యాలు ఆకుకూరలు పాలు గుడ్డు లాంటి పౌష్టికాహారం పెట్టాలని సూచించారు. అంగన్వాడి కేంద్రాల్లో ఏడు నుండి మూడు సంవత్సరాలు వయసు గల పిల్లలకు బాలామృతం పాలు గుడ్లు ఇస్తున్నట్లు తద్వారా పిల్లల్లో పోషణ లోపం రక్త హీనత రాకుండా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తల్లులు, ఆశ, అంగన్వాడి టీచర్లు, అనూష, ఐసిడిఎస్ సూపర్వైజర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా వినాయక చవితి నిర్వహించాలి

సీఐ బీమానాయక్

విశాలాంధ్ర-పామూరు : వినాయక చవితి పండుగను అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రశాంతంగా జరుపుకోవాలని సిఐ ఎం భీమానాయక్ అన్నారు. పట్టణంలో గణనాధుని విగ్రహాలకు మండపాలు ఏర్పాటు చేసే ప్రదేశాలను సిఐ భీమా నాయక్ శుక్రవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మండపాలు వద్ద ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించే విధముగా ఆయా మండపాల కమిటీలు బాధ్యతలు వహించాలన్నారు. మండపాలు వద్ద లౌడ్ స్పీకర్లు, డీజేలు పెట్టరాదు అన్నారు. రాత్రులు సమయాల్లో తప్పనిసరిగా మండపాలు వద్ద కాపుల ఉండాలన్నారు. పట్టణంలో 5వ రోజు నిమజ్జనం జరుగు ప్రదేశమును బ్రహ్మానందరెడ్డితో కలసి పరిశీలించినట్లు భీమ నాయక్ తెలిపారు.

ప్రశాంత వాతావరణంలో నిమజ్జనం జరుగుటకు సహకరించాలని కోరారు.

ముందస్తు జాగ్రత్తలతోనే ఆరోగ్యం

డాక్టర్ వసంతం వీరరాఘవయ్య

విశాలాంధ్ర - రేపల్లె : ఆరోగ్యం పాడైపోయాక డాక్టర్ల వద్దకు పరుగులు పెట్టే కన్నా ముందు జాగ్రత్త అత్యంత అవసరమని ప్రతి వ్యక్తి తన ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని డాక్టర్ వసంతం వీర రాఘవయ్య అన్నారు.శుక్రవారం స్థానిక లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసి) కార్యాలయంలో జరిగిన 68వ ఇన్సూరెన్స్ సెలబ్రేషన్స్ సందర్భంగా ఏర్పాటు చేసిన ఉచిత ఆరోగ్య పరీక్షల వైద్య శిబిరంలో డాక్టర్ వసంత వీర రాఘవయ్య మాట్లాడుతూ ఆరోగ్య శిబిరాన్ని ప్రత్యేకించి లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సిబ్బంది,ఏజెంట్లు కోసం బ్రాంచ్ మేనేజర్ జి. ఉమామహేశ్వరరావు ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు.ఆరోగ్యంతోనే ఆర్థిక పరిపుష్టి కలుగుతుందన్నారు.ఈ శిబిరాన్ని అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ కేఎన్‌డివి ప్రసాద్ క్యాంపు ఏర్పాట్లు పరిశీలించారు.ఏవో కెవి కోటేశ్వరరావు ఏర్పాట్లు చేపట్టారు. ఈ క్యాంపులో షుగర్ వ్యాధికి ముందస్తు పరీక్షలు,బీపీ పరీక్షలు, కండ్లకు సంబంధించిన రుగ్మతల గురించిన పరీక్షలు నిర్వహించారు.ఈ క్యాంపులో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రేపల్లె సబ్ డిస్ట్రిక్ట్ చైర్మన్ కూడా డాక్టర్ వసంతం వీర రాఘవయ్యతో కలిసి డాక్టర్ల బృందం డాక్టర్ మనోహర్,డాక్టర్ అసిపుల్లా సాధిక్,డాక్టర్ రమేష్ బాబు,డాక్టర్ సాయి కృష్ణ, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రేపల్లె సబ్ డిస్ట్రిక్ట్ కార్యనిర్వాహక కమిటీ సభ్యులు సయ్యద్ కరిముల్లా పాల్గొన్నారు.

గణపతి ప్రతిమలు పంపిణీ

విశాలాంధ్ర-పర్చూరు: పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతులను శుక్రవారం స్థానిక శ్రీవేణుగోపాల స్వామి దేవస్థానం నందు ఉచితంగా పంపిణీ చేశారు. మట్టి గణపతులను కోట శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ కోట ప్రసన్న దంపతుల ఆర్థిక సహకారంతో పంపిణీ చేశారు. కార్యక్రమంలో దేవస్థాన చైర్మన్ రావువారి వెంకట శివప్రసాద్, కార్యనిర్వహణ అధికారి ననిమెళ్ళ కోటిరెడ్డి ఉన్నారు. అలాగే మండలంలోని నూతలపాడు రోటరీ గంగ వద్ద రోటరీ ఆధ్వర్యంలో 550 మట్టి గణపతి ప్రతిమలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు తోకల కృష్ణమోహన్, కార్యదర్శి ఆంజనేయులు, సభ్యులు నాగభైరు శ్రీనివాసరావు, పాబోలు వెంకన్న, కొల్లా సుబ్బారావు, సదానందరెడ్డి, వెంకటసుబ్బయ్య, రాజగోపాలరెడ్డి, సత్యనారాయణ, సర్పంచ్ చిన్నయ్య, గ్రామస్థులు ఉన్నారు.

10న ఉద్యోగమేళా

విశాలాంధ్ర-పర్చూరు: యువత ఉద్యోగమేళాలలో పాల్గొని ఉద్యోగాలు సాధించాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి తమ్మాజీరావు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఉపాధి కార్యాలయం, సీడాప్ వారి ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 10వ తేదీ ఉద్యోగమేళా నిర్వహిస్తున్నామని, 120 ఖాళీలు ఉన్నాయని, 10వ తరగతి నుండి పీజీ వరకు అర్హతను బట్టి జీత, భత్యాలు ఉంటాయని తెలిపారు. నిరుద్యోగ యువత అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు సమన్వయకర్తలు వినోద్, హారికలను 6302764962 ద్వారా సంప్రదించాలని తమ్మాజీరావు తెలిపారు.

రోటరీ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం

విశాలాంధ్ర-అద్దంకి : జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మాజీ సర్పంచ్ చెన్నుపల్లి వెంకటేశ్వర్లు సౌజన్యంతో శుక్రవారం స్థానిక గీతామందిరంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.విద్యారంగంలో విశేష ప్రతిభ కనబరచిన 15మంది ఉపాధ్యాయులను నేషనల్ బిల్డర్ అవార్డుతో సత్కరించారు.ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆర్టీసి డిపో మేనేజర్ బెల్లం రామమోహనరావు మాట్లాడుతూ థామస్ ఎడిసన్ విద్యుత్ బల్బు కనుగొని వెలుతురు ఇస్తే గురువు మనలోని అజ్ఞానతిమిరాన్ని తొలగించి విజ్ఞాన జ్యోతుల్ని వెలిగిస్తాడని పేర్కొన్నారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు చప్పిడి వీరయ్య,కార్యదర్శి మలాది శ్రీనివాసరావు,ట్రెజరర్ చుండూరి మురళీసుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవిత కాల సాధన అవార్డుకు పుట్టంరాజు ఎంపిక

విశాలాంధ్ర-అద్దంకి : డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవిత కాల సాధన అవార్డు-2024కు అద్దంకికి చెందిన సాహితీ వేత్త విశ్రాంత ప్రధానో పాధ్యా యులు పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి ఎంపికైనట్లు అవార్డు గ్రహీత పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి తెలిపారు. అభిలాష్ హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ వారు ప్రతి ఏటా సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్క రించుకొని విద్యారంగంలో విశేష కృషి చేసిన వారికి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు అందిస్తున్నారు.అవార్డుకు ఎంపికైన పుట్టంరాజును శుక్రవారం రోటరీ సంస్థ,సాహితీ మిత్రమండలి బాధ్యులు చప్పిడి వీరయ్య, దేవ పాలన,డివిఎం సత్యనారాయణ తదితరులు అభినందించారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగింపు

విశాలాంధ్ర - అద్దంకి : విద్యుత్ సంస్కరణలలో భాగంగా అన్ని ప్రభుత్వ కార్యాలయములకు స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నట్లు విద్యుత్ శాఖ కార్యనిర్వాహక ఇంజనీరు నల్లూరి మస్తాన్ రావు తెలిపారు.ఇందులో భాగంగా తొలి మీటరును శుక్రవారం అద్దంకి పట్టణంలోని వ్యవసాయ శాఖ కార్యాలయానికి బిగించారు. త్వరలో అద్దంకి డివిజన్ పరిధిలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు విద్యుత్ స్మార్ట్ మీటర్లు పెట్టబోతున్నట్లు మస్తాన్ రావు తెలిపారు.

కొలలపూడిలో పారిశుధ్య పనులు ప్రారంభం

విశాలాంధ్ర - మార్టూరు : మండల పరిధిలోని కొలలపూడిలో శుక్రవారం పారిశుధ్య పనులు ప్రారంభించినట్లు సర్పంచ్ మోరపాకుల సతీష్ కుమార్,కార్యదర్శి లక్ష్మీ ఒక ప్రకటనలో తెలిపారు.ఇటీవల కురిసిన భారీ వర్షాలు కారణంగా గ్రామాల్లో ఎటువంటి వ్యాధుల ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యగా పారిశుద్ధ్య పనులు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పనులు చేపట్టినట్లు వారు తెలిపారు.ప్రొక్లైన్ ద్వారా,కూలీల ద్వారా పనులు చేపడుతున్న తెలిపారు.గ్రామస్తులు కూడా ఇళ్లలో చెత్తను చెత్త సైకిల్‌లో వేయాలని,పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేందుకు సహకరించాలని తెలిపారు.ఇటీవల కురిసిన వర్షాలకు వీధి లైట్లు మడిపోయాయని,త్వరలో వీధి లైట్లు కూడా ఏర్పాటు చేసి,బ్లీచింగ్ కూడా చల్లుతామని తెలిపారు.కాచి చల్లారిన నీరు తాగాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని గ్రామస్తులకు విజ్ఞప్తి చేశారు.

పంట నష్టం అంచనా తయారు చేయాలి

విశాలాంధ్ర - చెరుకుపల్లి : గత వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పంట నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తుందని తాసిల్దార్ సిహెచ్ పద్మావతి,మండల వ్యవసాయ అధికారి టి.బాలాజీ గంగాధర్ అన్నారు.శుక్రవారం స్థానిక తాసిల్దార్ కార్యాలయంలో గ్రామ వీఆర్వోలు సర్వేయర్లు వ్యవసాయశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో సుమారు వంద ఎకరాల విస్తీర్ణంలో పంట దెబ్బతిన్నాయన్నారు.అయితే 33శాతం దెబ్బతిన్న పోలాలను గుర్తించి ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని తెలిపారు. దీనికిగాను ఆయా గ్రామ రెవెన్యూ అధికారులు సర్వేలతో ఆ పొలాన్ని సందర్శించి పంట నష్టం వివరాలను నమోదు చేయాలన్నారు. వీరికి ఆయా గ్రామ వ్యవసాయ సహాయకులు తోడ్పాటు అందిస్తారన్నారు.ఈ కార్యక్రమంలో వీఆర్వోలు వ్యవసాయ విస్తరణ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పాడి పశువుల రైతులకు దాణా పంపిణీ

విశాలాంధ్ర - రేపల్లె : మండలంలోని రావిఅనంతవరం గ్రామంలో వరదలకు దెబ్బతిన్న వరద ప్రభావిత ప్రాంతాలైన మండలంలో పెనుమూడి, పల్లెపాలెం, రావిఅనంతవరంలో పాడి పశువులు రైతులకు పశుసంవర్ధక శాఖ వారి ద్వారా టీఎంఆర్ దాణాను టీడీపీ నాయకులు అనగాని శివప్రసాద్ చేతులు మీదగా పాడి రైతులుకు రెండు టన్నులు దాణా పంపిణీ చేయటం జరిగింది.అదేవిధంగా 150 పశువులకు హెల్త్ క్యాంపు ఏర్పాటు చేసి మందులు అందించారన్నారు.ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పంతాని మురళీధరరావు, జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి డాక్టర్ ఎం.హనుమంతురావు, రేపల్లె సహాయ సంచాలకులు డాక్టర్ బెల్లంకొండ నాంచారయ్య, రేపల్లె మండలం పశువైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్ కుమార్,ఎల్ఎస్ఏ వెంకటేశ్వర్లు, రత్నం, ఏహెచ్ఏలు,పశువైద్య సిబ్బంది,పాడి రైతులు పాల్గొన్నారు.

సిఐ ఖాజావలిని కలిసిన రంగసాయి

విశాలాంధ్ర-హనుమంతునిపాడు : కనిగిరి పట్టణంలోని పోలీస్ స్టేషన్ నందు సీఐ ఖాజావలిని హనుమంతునిపాడు మండల పరిధిలోని ఉన్న నందనవనం పంచాయతీకి చెందిన రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి ముప్ప రంగసాయి యాదవ్ సీఐ ఖాజావలిని మర్యాదపూర్వకంగా కలసి పుష్ప గుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

విశాలాంధ్ర - వేటపాలెం : పుట్టిన ప్రతి బిడ్డకు పోషకాలతో కూడిన ఆహారాన్ని అందించాలని వేటపాలెం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సూపర్వైజర్ సజ్జా పుష్పవల్లి అన్నారు.వేటపాలెం సెక్టార్‌లోని పందిళ్ళపల్లి సెక్టార్లలో శుక్రవారం పౌష్టికాహార మాసోత్సవ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నా రు. పుట్టిన ప్రతి బిడ్డకు ఆరు మాసాల వరకు ముర్రుపాలు అందించాలని,బిడ్డ ఎదుగుదలకు పౌష్టికా హారమే మూలమని వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు,తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి లెటర్ అందజేత

విశాలాంధ్ర - రేపల్లె : మండలంలోని కైతేపల్లి గ్రామానికి చెందిన మేడికొండ వర్షిత అనారోగ్యంతో బాధపడుతున్న సందర్భంగా రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ చొరవతో వైద్య ఖర్చులు కోసం రూ. 1,50,000 సీఎం సహాయ నిధి లెటర్‌ను వర్షితకు టీడీపీ నాయకుడు అనగాని శివప్రసాద్ అందజేశారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వడ్డీ లక్ష్మోజీ,ధర్మ తేజ,తెలుగు యువత నాయకులు కొలసాని రాము,టీడీపీ జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షులు ఎం.అంకాలు,వర్షిత తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మట్టి వినాయక ప్రతిమల పంపిణీ

విశాలాంధ్ర - అద్దంకి : వినాయక చవితి సందర్భంగా శుక్రవారం రోటరీ క్లబ్ ఆఫ్ సింగరకొండ,అద్దంకి ఆధ్వర్యంలో,రొటేరియన్ కాకాని రాధాకృష్ణమూర్తి సౌజన్యంతో శ్రీప్రకాశం బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు అలాగే రోటరీ ఆఫీస్ వద్ద ప్రజలకు మట్టి వినాయక విగ్రహాలు మొత్తం 500 పంపిణీ చేశారు.

వరద బాధితులకు ప్రభుత్వ సహకారం

కలెక్టర్ వెంకట మురళి

విశాలాంధ్ర - రేపల్లె : ఇటీవల కురిసిన భారీ వర్షాలు,వరదల ప్రభావం కారణంగా నష్టపోయిన వారందరిని ప్రభుత్వం ద్వారా ఆదుకుంటామని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు.శుక్రవారం పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో వరద బాధితులకు నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమాన్ని కలెక్టర్ నిర్వహించారు. పెసరలంక గ్రామంలో నిత్యావసర సరుకుల పంపిణీని నిశితంగా పరిశీలించారు.సరుకుల నాణ్యతను చూశారు.పెసరలంక గ్రామాలలోని ప్రజలకు తయారు చేసిన ఆహార పదార్థాలు,పశుగ్రాసం బస్తాలను పరిశీలించారు.4,400 పశువులకు అందుతున్న పశుగ్రాసం నాణ్యతను పరిశీలించారు.అనంతరం శ్రీ నాంచారమ్మ తల్లి దేవాలయంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని పరిశీలించి,వైద్య సహాయక చర్యలపై ఆరా తీశారు.ఆ గ్రామంలో 584 గ్రహాలలో ఇంటింటి సర్వే నిర్వహణపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.వైద్య శిబిరంలో ఏర్పాటుచేసిన ఔషధాలను పరిశీలించారు.పెద్దలంక గ్రామంలో నీట మునిగిన పసుపు,దొండ,అరటి పంటలను పరిశీలించారు. రేపటి నుంచి గృహాల సర్వే,పంటల సర్వే ప్రారంభమవుతుందని ప్రజలు సహకరించాలన్నారు.పెసరలంకలో మట్టి గోడలతో నిర్మించిన పూరి గుడిసె పూర్తిగా దెబ్బతినడంతో జిల్లా కలెక్టర్ పరిశీలించారు.గృహ యజమాని తుంగల వెంకటేశ్వర్లుతో మాట్లాడారు.మేట వేసిన బురదను తొలగించి శుభ్రం చేసుకుంటున్న ఇంటిలోకి వెళ్లి నిశితంగా పరిశీలించారు.కుటుంబ సభ్యులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు.దెబ్బతిన్న కుటుంబాల వారిని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. రేపల్లె మండలం పెనుమూడి పల్లెపాలెం గ్రామాన్ని జిల్లా కలెక్టర్ ఆర్డీవోతో కలిసి సందర్శించారు. అనంతరం లంక గ్రామాలైన చింతమోటు గుంటూరు గూడెం పెదలంక ఓలేరుపల్లెపాలెంలో జిల్లా కలెక్టర్ పర్యటించారు.ఆయన వెంట రేపల్లె ఆర్డీవో హేలా షారోన్ వివిధ శాఖల అధికారులు,టీడీపీ,జనసేన,బిజెపి నాయకులు పాల్గొన్నారు.

వరిలో కాలి బాటలు తప్పనిసరి

విశాలాంధ్ర - అద్దంకి : వరిలో కాలిబాటలు తప్పనిసరిగా తీయాలని మండల వ్యవసాయ అధికారి కొర్రపాటి వెంకటకృష్ణ తెలిపారు. శుక్రవారం మండలంలోని కలవకూరులో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఏవో వెంకటకృష్ణ మాట్లాడుతూ 25 నుండి 30 రోజుల నారును నాటుకోవాలని నీరు పలచగా ఉండాలన్నారు. నారు కొసలు తుంచి నాటుకోవాలని దీంతో కాండం తొలుచు పురుగును నివారించుకోవచ్చునని రైతులకు సూచించారు.నాటు వేసిన తర్వాత ప్రతి రెండు మీటర్లకు ఒక అడుగు వెడల్పు తూర్పు పడమర దిశలో కాలిబాటలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ.కోటేశ్వరరావు,గ్రామ వ్యవసాయ సహాయకులు మస్తాన్ రావు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు నిత్యవసరాలు పంపిణీ

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : భట్టిప్రోలు మండలంలోని చింతమోటు గ్రామంలో ఎంపీ తెన్నేటి కృష్ణ ప్రసాద్ చేతుల మీదగా వరద బాధితులకు నిత్యావసర వస్తువుల పంపిణీ చేశారు.అనంతరం జువ్వలపాలెంలో నిత్యావసర వస్తువుల పంపిణీని పర్యవేక్షిస్తున్న జాయింట్ కలెక్టర్ ప్రఖర్ జైన్,ఆర్డిఓ సూర్య నారాయణ రెడ్డి,పాల్గొన్న పలు శాఖా అధికారులు పాల్గొ న్నారు.గాజుల్లంకలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో పాల్గొని వరద ప్రభావిత ప్రాంతాల్లో వ్యాధులు సోకకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచనలు చేశారు.

పౌష్టికాహారాలపై అవగాహన సదస్సు

విశాలాంధ్ర - చీరాల : పౌష్టికాహారం తీసుకోవడం వల్ల తల్లులు ఆరోగ్యంగా ఉంటూ ఆరోగ్యవంతమైన బిడ్డకు జన్మనిస్తారని ఏ1 సెక్టార్ సూపర్‌వైజర్ తబిత అన్నారు.పట్టణ పరిధిలోని శాంతినగర్,శృంగార పేట అంగన్వాడి కేంద్రంలో పౌష్టికాహారం మాసోత్సవ కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా తబిత మాట్లాడుతూ గర్భవతులు బాలింతలు రక్తహీనత బారినపడకుండా అన్ని పోషకాలు కలిగిన పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. అనంతరం పౌష్టికాహారాలపై ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో టీచర్లు ఎలిజిబెత్ రేఖా,సులోచన,సంధ్య,ఉమా,లత,అనిత తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు అనంతవరం గ్రామస్తుల ఆర్థిక చేయూత

విశాలాంధ్ర - యద్దనపూడి : విజయవాడ వరద బాధితుల సహాయార్థం మండలంలోని అనంతవరం గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు ఆర్థిక చేయూత అందించారు. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావును విజయవాడలో కలిసి రూ.1,35,000 నగదు ఆయనకు అందజేశారు.ఎమ్మెల్యే వారిని అభినందించారు.ఈ సందర్భంగా ఏలూరి మాట్లాడుతూ పక్కవారు బాధలలో ఆపదలో ఉన్నప్పుడు సహకరించడం అందరి బాధ్యత అని,అన్ని వర్గాలా ప్రజలు బాధితులకు ఎంతగానో సహకరిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో గుదే తారక రామారావు,కొరటాల వంశీకృష్ణ,నిమ్మల సాంబశివరావు, పెడవల్లి వెంకటేశ్వరరావు,మానుకొండ సాంబశివరావు,పోపూరి సాంబశివరావు,పెరవల్లి అంజయ్య,పెరవలి సాంబశివరావు, మండవ వెంకటేశ్వరరావు ఏ.సుబ్బారావు, పి.హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పున:ప్రారంభం

విశాలాంధ్ర - నిజాంపట్నం : రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని నిజాంపట్నం జడ్పీటీసీ సభ్యులు నర్రా సుబ్బయ్య అన్నారు.మండలంలోని అముదాలపల్లి గ్రామం లో ఉన్న లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును శుక్రవారం జడ్పీటీసీ నర్రా సుబ్బయ్య పున:ప్రారంభించి స్విచ్ ఆన్ చేసి సాగు నీటిని విడుదల చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఎక రాకు సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.ఈ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ద్వారా సుమారు 700 ఎకరాల భూములకు సాగునీరు అందుతుందని చెప్పారు.రైతుల పంట పొలాలకు సాగు నీటికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సాగు నీరుని విడుదల చేయాలని లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ప్రెసిడెంట్‌కి అయన సూచించారు.ఈ కార్యక్రమంలో లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ప్రెసిడెంట్ మరక సూర్యనారాయణ, పందరబోయిన శ్రీనివా సరావు,పందరబోయిన కృష్ణ,మరక నాగరాజు, నర్రా కృష్ణ,మరక వెంకటేశ్వర్లు (చిన్న రాయుడు), రైతులు పాల్గొన్నారు.

గాడిపత్తివారిపాలెం డీలర్‌షిప్ వివాదం

విశాలాంధ్ర-చీమకుర్తి : గత టిడిపి గవర్నమెంట్ కోటా ఇచ్చిన మాజీ మణిమేల వెంకట్రావు ఇప్పుడు తన భార్య పేరిట కోటకి అప్లై చేశానని అయినప్పటికీ వేరే వాళ్లకు ఇవ్వమని ఆర్డీవోకు ఎమ్మార్వో పంపించాడని, మాకు అన్ని విషయాల్లో కూడా అర్హతలు ఉన్నాయని మా భార్య 1984లో జన్మించిందని, టెన్త్ క్లాస్ పాస్ అయిందని కాబట్టి గతంలో ఇచ్చినటువంటి అనుభవం ఉందని, కోటాను మాకే ఇవ్వాలని గాడి పత్తివారిపాలెం టిడిపి నాయకులు మనిమేల వెంకట్రావుకి బాసటగా టిడిపి సీనియర్ నాయకులు సూరంపల్లి హనుమంతరావు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ కందిమళ్ళ గంగాధర్, మాజీ మున్సిపల్ చైర్మన్ కొత్రపు రాఘవరావు, శేషయ్య, గోనుగుంట రామాంజనేయులు, మనిమేల అంజయ్య, గమిని ఆంజనేయులు, మండల కోటేశ్వరరావు, తదితరులు కోరారు. నాయకులు ఎమ్మార్వో సుబ్బారావుకి వినతిపత్రం అందజేశారు.

గ్రామ పంచాయతీ కార్యాలయం - బేస్తవారిపేట

టెండరు నోటీసు

ఆర్.ఓ.సి.నెం.25/2024 **తేది : 6-9-2024**

ప్రకాశం జిల్లా బేస్తవారిపేట మండలం బేస్తవారిపేట గ్రామ పంచాయితీకి ఈదిగువ తెలిపిన **01-07-2024 నుండి 30-06-2025 వరకు** అనగా ఒక సంవత్సర కాలమునకు ఈ దిగువ తెలిపిన పోస్టులలో టెండరు పద్ధతిపై పని చేయుటకు సీల్డు వేసిన టెండర్లను **తేది. 12-09-2024 న ఉదయము 11.00 గంటల నుండి మద్యాహ్నం 3.00 గంటల వరకు** బేస్తవారిపేట గ్రామపంచాయితీ కార్యాలయము వద్ధ ఈదిగువ సంతకం దారునిచే గాని లేక వారి అనుమతి పొందిన వారిచే గాని టెండర్లు సీక్వరించబడి అదే రోజు **సాయంత్రము 4.00 గంటలకు** హాజరైన టెండరు దారుల సమక్షములో టెండర్లు తెరువబడును. ఆసక్తిగలవారు ఆయా టెండర్లలో పాల్గొన వచును, సకాలములో రాని టెండర్లను మరియు నిర్ణీత ధరావత్తు చెల్లించి రశీదు జతపరచని టెండర్లను తిరస్కరించబడును. టెండర్లను వాయిదా వేయుటకు గాని రద్దు పరుచుటకు గాని పంచాయితీ కార్యదర్శిగార్కి అధికారము కలదు. మిగిలిన విషయములు ఆఫీసు పనివేళల యందు అడిగి తెలుసుకొనవచ్చును.

వ.నెం.	టెండరు వివరములు	కాలము	ఖాళీల సంఖ్య	చెల్లించవలసిన ధరావత్తు
1	టెండరు పద్ధతిపై పనిచేయుటకు 24 మంది పారిశుధ్య పనివారలను (స్వీపర్లు) సరఫరాచేయుట.	01-07-2024 నుండి 30-06-2025 వరకు	24 మంది	రూ 200./- ఒక్కొరికి
2	టెండరు పద్ధతిపై పనిచేయుటకు శానిటరీ మేస్త్రీ ని సరఫరా చేయుట.	01-07-2024 నుండి 30-06-2025 వరకు	1 రు	రూ 200./- ఒక్కొరికి
3	టెండరు పద్ధతిపై పనిచేయుటకు ట్రాక్టరు డ్రైవర్లు – 02 మరియు చెత్త ఆటో డ్రైవర్ – 01 (లైసెన్సు ఉన్న వారు మాత్రమే).	01-07-2024 నుండి 30-06-2025 వరకు	3 రు	రూ 200./- ఒక్కొరికి
4	టెండరు పద్ధతిపై రక్షిత మంచినీటి సరఫరా పథకం నిర్వహణకు టర్న్‌కాక్ లుగా పని చేయుటకుగాను – 07 గురుని సరఫరాచేయుట.	01-07-2024 నుండి 30-06-2025 వరకు	7 గురు	రూ 200./- ఒక్కొరికి
5	టెండరు పద్ధతిపై రక్షిత మంచినీటి సరఫరా పథకం నిర్వహణకు టర్న్‌కాక్ (కం) ఫిట్టర్ గా పని చేయుటకుగాను - 01 సరఫరాచేయుట.	01-07-2024 నుండి 30-06-2025 వరకు	1 రు	రూ 200./- ఒక్కొరికి
6	టెండరు పద్ధతిపై పనిచేయుటకు ఎలక్ట్రిషియన్లు - 02 సరఫరాచేయుట.	01-07-2024 నుండి 30-06-2025 వరకు	ఇద్ధరు	రూ 200./- ఒక్కొరికి
7	టెండరు పద్ధతిపై పనిచేయుటకు కంప్యూటర్ ఆపరేటర్ (టెక్నికల్ క్వాలిపై గలవారిని) సరఫరాచేయుట. -01	01-07-2024 నుండి 30-06-2025 వరకు	1 రు	రూ 200./- ఒక్కొరికి

గమనిక :- 1. గ్రామపంచాయితీ లో సాధారణ నిధులు పుష్కలముగా ఉన్నప్పుడు మాత్రమే బిల్లులు చెల్లించబడును.
2. టెండరు దారుని సేవలు సంతృప్తికరముగా లేనియెడల వారి టెండరును రద్దు చేయబడును.

సం/- **జి.నరేంద్ర**
పంచాయతీ కార్యదర్శి, Gr-II,
గ్రామ పంచాయతీ- బేస్తవారిపేట

వరద బాధితులకు మందుల కిట్లు పంపిణీ

విశాలాంధ్ర – చీరాల : ఆపదలో ఉన్న ప్రజలకు తమ వంతు సహకారం అందించాలనే ఉద్దేశ్యంతో వెయ్యి మెడికల్ కిట్లు ఏర్పాటు చేసి వరద బాధితులకు పంపిస్తున్నమని చీరాల మందుల షాపుల యజమానులు సంఘం సభ్యులు అన్నారు. చీరాల మందుల షాపుల యాజమానుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం విజయవాడ వరద బాధితుల కోసం అత్యవసర మందుల కిట్లను సిద్ధం చేశారు. ఈ సందర్భంగా మందుల షాప్ యాజమాన్యం మాట్లాడుతూ విజయవాడలోని వరద ముంపు ప్రాంతాల్లో ప్రకృతి విపత్తు వలన బాధితులైన ప్రజలకు సహాయం చెయ్యటం మనందరి యొక్క బాధ్యత అని అన్నారు. చీరాల ప్రాంతంలోని మందుల షాపులు యాజమానులు ఆరు రకాల మందులతో కూడిన వెయ్యి మెడికల్ కిట్లను తయారు చేశామన్నారు. ఈ కిట్లను డ్రగ్ ఇన్‌స్పెక్టర్ విజయలక్ష్మి ధ్వారా విజయవాడ ముంపు ప్రాంతాలకు పంపిస్తున్నామన్నారు. ఇలా పంపిసున్నందుకు మా యాజమాన్యం అందరూ సంతోష పడుతున్నామని తెలిపారు.

నిత్యవసరాలు పంపిణీ

విశాలాంధ్ర – బాపట్ల టౌన్ : వరద బాధితులకు సహాయార్థం వరద బాధితులకు అండగా ఉంటున్న మాజీ సైనికులకు ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ అభినందించారు. మాజీ సైనిక సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు తాండ్ర సాంబశివరావు ఆధ్వర్యంలో మాజీ సైనికులతో కలసి వరద బాధితులకు రూ.50 వేల విలువ చేసే నిత్యావసర వస్తువుల జిల్లా కలెక్టర్ వెంకట మురళి ఆదేశాల మేరకు కొల్లూరు ప్రాంతంలో పంపిణీ చేసామన్నారు. ఈ కార్యక్రమానికి సహకరించిన బాపట్ల జిల్లాలోని ప్రతి మాజీ సైనికుడికి తాండ్ర ధన్యవాదాలు తెలియజేశారు. నిత్యావసర సరుకులు పంపిణీ కార్యక్రమంలో జిల్లా మాజీ సైనిక సంక్షేమ సంఘం వైస్ ప్రెసిడెంట్ రేపల్లె అసోసియేషన్ ప్రెసిడెంట్ సుభానీ బేగ్, బాపట్ల అసోసియేషన్ ఉపాధ్యక్షులు పుట్టా ఆదిశేష రెడ్డి, ట్రెజరర్ పువ్వాడ యల్లమంద, ఉమ్మడి గుంటూరు జిల్లా కో ఆర్డినేషన్ కమిటీ అధ్యక్షులు సుంకర శేషగిరి రావు, సీనియర్ మాజీ సైనికులు తోట దుర్గారావు, రుక్మ ధరరావు, షేక్ కరిముల్లా, పసుపులేటి ప్రసాద్ ,డి.వెంకటేశ్వర్లు, రాయిపూడి శ్రీనివాసరావు, నరసింహారావు, ప్రసాద్, వెంకట కృష్ణా రెడ్డి, ఆడే కిషోర్‌లు పాల్గొన్నారు.

వరద బాధితులకు సహకరిస్తున్న ప్రజలకు అభినందనలు:మాలకొండయ్య

విశాలాంధ్ర – చీరాల : విజయవాడ వరద బాధితులకు అండగా నిలిచేందుకు ముందుకు వస్తున్న ప్రతి ఒక్కరికీ అభినందనలని ఎమ్మెల్యే మాలకొండయ్య అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే ఆదేశానుసారం పులి వెంకటేశ్వర్లు లక్ష రూపాయలు, కారుసాల శైలజ యాభై వేల రూపాయలు సిఎం రిలీఫ్ ఫండ్‌కి విరాళం ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రకృతి విపత్తులు తలెత్తినప్పుడు ప్రజలందరూ అండగా నిలవడం విశేషమని తమ వంతు సహకారం అందించాలనే సదుద్దేశంతో ముందుకు వచ్చిన పులి వెంకటేశ్వర్లు, శైలజలను అభినందిస్తున్నాను అని అన్నారు.

మట్టి గణపతిని పూజించి పర్యావరణాన్ని కాపాడుకుందాం

– జిల్లా అడిషనల్ ఎస్పీ టి.పి విఠలేశ్వర్

విశాలాంధ్ర – బాపట్ల టౌన్ : మట్టి గణపతిని పూజించి పర్యావరణాన్ని కాపాడుకుందామని జిల్లా అడిషనల్ ఎస్పీ టి.పి విఠలేశ్వర్ ప్రజలకు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక గడియారం స్తంభం సెంటర్ మహాలక్ష్మి చెట్టు కూడలి వద్ద అఖండ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో ఉచిత మట్టి గణపతి విగ్రహాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా అడిషనల్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అఖండ ఫౌండేషన్ అధ్యక్షులు విన్నకోట సురేష్ బాపట్ల పట్టణం చీలు రోడ్డు సెంటర్‌లో, అలాగే గడియార స్తంభం సెంటర్ రెండు ప్రదేశాల్లో మట్టి గణపతి విగ్రహాలు, వినాయక వ్రతకల్పం ఉచితంగా ప్రజలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడేందుకు మట్టితో తయారు చేసిన గణపతిని పూజించాలన్నారు. మట్టి గణపతితో వినాయక చవితి విశిష్టతను పెంచేలా మనమందరం సమిష్టిగా కృషి చేయాలని, సహజ రంగులతో తయారు చేసిన మట్టి వినాయకుని విగ్రహాలను పూజించాలన్నారు. అఖండ ఫౌండేషన్ అధ్యక్షులు విన్నకోట సురేష్ మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌లో జిప్సం, గంధకం, మెగ్నీషియం వంటి హానికర రసాయనాల వలన నీరు కాలుష్యం అవుతుందని, ఆ నీటిని మనం వినియోగించడం ద్వారా ఊపిరితిత్తులతో పాటు చర్మ, రక్త, కంటి సంబంధిత వ్యాధులు ఇతర సమస్యలు వస్తాయన్నారు. పర్యావరణాన్ని కాపాడుకోవడం మన అందరి బాధ్యత పట్టణ సిఐ మహమ్మద్ జానీ పేర్కొన్నారు.. ఈ కార్యక్రమంలో అఖండ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి వంగపాటి శివ, కార్యవర్గ సభ్యులు మామిడి రమేష్, గొర్ల ఆంజనేయ ప్రసాద్, పులిగడ్డ శ్యాంప్రసాద్, కర్పూరపు శ్రీనివాస్, కురువ వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

పాలకుల అలసత్వానికి నిదర్శనం విజయవాడ వరద

విశాలాంధ్ర-కనిగిరి : విజయవాడ వరద బాధితులను ఆదుకోవాలని సీపీఐ కనిగిరి మండల సమితి ఆధ్వర్యంలో వ్యాపారులను వద్ద నుండి విరాళాలు సేకరించి నందుకు పట్టణంలో సీపీఐ బృందం బయలుదేరింది. ఈ క్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ముందుగా విరాళాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు శుక్రవారం మండల కార్యదర్శి జివి రామారావు ఆధ్వర్యంలో కనిగిరి పురవీధుల్లో వ్యాపారులు వీధి వ్యాపారుల సానుభూతిపరులు ప్రజల వద్ద నుండి విరాళాలను సేకరించారు. 16 వేల రూపాయలు సేకరించారు. అనంతరం మండల కార్యదర్శి జివి రామారావు మాట్లాడుతూ విజయవాడలో మునుపెన్నడు లేనివిధంగా ఒక్కసారిగా వరద బీభత్సంతో ఆ ప్రాంత ప్రజలు తండ్రికి బిడ్డ తల్లికి కూమార్తె అనే తేడా లేకుండా ఒకరికొకరు సంబంధం లేకుండా కాక వికలమైన విధంగా ఉందని ఈ విపత్తుకు కారకులు పాలకులేనని పాలకుల స్వార్ధపూరిత విధానాలతో నేడు విజయవాడలో ఇటువంటి దుస్థితి ఏర్పడిందన్నారు ఈ కార్యక్రమంలో సీపీఐ రైతు సంఘం నాయకులు గుజ్జుల బాలిరెడ్డి, దళిత హక్కుల పోరాట సమితి ప్రకాశం జిల్లా ప్రధాన కార్యదర్శి పందిటి మోహన్, ఏఐటీయూసీ నాయకులు కాసిం వలి, ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు పుట్ట సుబ్బారావు, చేతివృత్తుదారుల సంఘం నాయకులు కిరణ్, మీరావలి, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు పవన్ కళ్యాణ్, టౌన్ కన్వీనర్ సురేష్, మండల కన్వీనర్ విఘరాజ్, సీపీఐ మండల నాయకులు అంకమ్మ, రామయ్య, యోహాన్, కోటేశ్వరరావు, అన్నపూర్ణమ్మ, తదితర సీపీఐ ఏఐఎస్ఎఫ్ ఏఐటిసి డిహెచ్పిఎస్, ప్రజా సంఘాల నాయకులు కార్యకర్తలు పాల్గొని విరాళాలు సేకరించారు.

పౌష్టికాహారంపై అవగాహన

విశాలాంధ్ర-శింగరాయకొండ : గర్భవతులు, బాలింతలు పోషకాహారాన్ని తీసుకోవడం వలన ఆరోగ్య సంరక్షణ కలుగుతుందని సూపర్‌వైజర్ ఎస్‌కె రిజ్వానా తెలిపారు. మండలంలోని పోతులచెంచయ్య కాలనీ అంగన్‌వాడీ సెంటర్‌లో 1 నుంచి 30 రోజుల పాటు జరిగే పోషకాహార మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. పాకల సూపర్‌వైజర్ సైదా, ఎల్ శ్రీదేవి, ఎస్ శ్రీలక్ష్మి, శైలజ, పద్మ, భూలక్ష్మి, సుజాత పాల్గొన్నారు.

నూతన సీఐగా సుబ్బారావు

విశాలాంధ్ర-మార్కాపురం : మార్కాపూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా పి సుబ్బారావు శుక్రవారం సాయంత్రం తన కార్యాలయంలో బాధ్యతలను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో శాంతిభద్రతలను మెరుగుపరిచేందుకు శాయశక్తుల కృషి చేస్తానని అన్నారు. గతంలో ఈయన పట్టణ ఎస్ఐగా కూడా పని చేశారు. ఈ సందర్భంగా సిఐ సుబ్బారావుకు పట్టణ రూరల్ ఎస్సైలు ఎం. సైదా బాబు అంకమ్మరావులు సిబ్బంది కలసి అభినందనలు తెలిపారు.

ప్రజలకు వినాయకచవితి శుభాకాంక్షలు

ఇన్‌ఛార్జి గొట్టిపాటి లక్ష్మి

విశాలాంధ్ర-దర్శి : దర్శి నియోజకవర్గం ప్రజలకు ఇంచార్జి గొట్టిపాటి లక్ష్మి వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరూ అత్యంత భక్తితో జరుపు కునే వినాయక చవితి భక్తి శ్రద్ధలతో వేడుకల జరుపుకోవాలని అన్నారు. మట్టి విగ్రహాలను పూజిద్దాం – ఈ పర్యావరణాన్ని కాపాడుదం అని అన్నారు.

వినాయక చవితి శుభాకాంక్షలు

ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి

విశాలాంధ్ర-హనుమంతునిపాడు : వినాయక చవితి పండుగ సందర్భంగా కనిగిరి నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి శుక్రవారం శుభాకాంక్షలు తెలిపారు. విఘ్నేశ్వరుడి అనుగ్రహంతో రాష్ట్రంలోని ప్రతి కుటుంబం సుఖ సంతోషాలతో ఉండాలని వారు కోరారు.

వినాయక చవితి శుభాకాంక్షలు

వైసీపీ ఇన్‌ఛార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్

విశాలాంధ్ర-హనుమంతునిపాడు : వినాయక చవితి పండుగ సందర్భంగా కనిగిరి నియోజకవర్గ ప్రజలకు వైసిపి ఇన్చార్జ్ డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ శుక్రవారం శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కనిగిరి నియోజకవర్గం ప్రజలందరికీ గణనాథుని ఆశీస్సులు ఉండాలని, క్షేమ, స్థైర్య, ఆయురారోగ్యాలు, సకల సంపదలు సిద్ధించాలని, సకల శుభాలు కలగాలని ఆకాంక్షించారు. ఇటీవల కురిసిన వర్షాలకు విజయవాడలో నిరాశ్రయులైన ప్రజలు త్వరగా కోలుకోవాలని కోరుకున్నారు. ప్రజల సమగ్రాభివృద్ధికి, పేదల సంక్షేమానికి ఎదురవుతున్న విఘ్నాలన్నీ తొలగిపోయి, ప్రజలందరికీ విజయాలు సిద్ధించాలని ఆకాంక్షించారు. విఘ్నేశ్వరుడి అనుగ్రహంతో రాష్ట్రంలోని ప్రతి కుటుంబం సుఖ సంతోషాలతో ఉండాలని కోరారు.

ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు

మాజీ ఎమ్మెల్యే కరణం

విశాలాంధ్ర – చీరాల : మొదటి పూజలన్నీ గణనాథుడికే, విఘ్నాలను తొలగించే ఆ వినాయకుడి ఆశీస్సులతో, తెలుగు రాష్ట్రాల ప్రజలు, నియోజకవర్గ ప్రజలు చేపట్టే ప్రతి పని సంపూర్ణంగా విజయవంతం కావాలని మాజీ ఎమ్మెల్యే కరణం బలరామ కృష్ణమూర్తి, వైఎస్ఆర్సీపీ ఇంచార్జీ కరణం వెంకటేష్ బాబు ఆకాంక్షించారు. బంధు మిత్రులతో కలసి ఆనందోత్సాహాలతో పండు గను జరుపుకోవాలని కోరుకుంటూ ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు.

లాకుల మరమ్మతులు పూర్తి చేయాలి

ఎమ్మెల్యే మాలకొండయ్య

విశాలాంధ్ర – చీరాల రూరల్ : వ్యవసాయ పనులు ప్రారంభం అవుతున్న ప్రస్తుత తరుణంలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అధికారులను ఆదేశించారు. మండలంలోని వాడరేవు నుండి విజయలక్ష్మీపురం మార్గంలో ఉన్న లాకులను పరిశీలించారు. గుర్రపు డెక్కతో కాలువ ఉండటాన్ని గమనించారు. లాకుల మరమ్మతు పనులు పూర్తి చేయాలన్నారు. అనంతరం వాడరేవు పంచాయితీ పరిధిలో భారీ వర్షాలకు దెబ్బతిన్న బోట్లను పరిశీలించారు. ఫిషర్ మ్యాన్ బిల్డింగ్ దెబ్బ తినడంను పరిశీలించారు. మత్స్యకారులతో మాట్లాడారు. విజయవాడ వరద బాధితులని ఆదుకునేందుకు సిఎం రిలీఫ్ ఫండ్‌కి పులి వెంకటేశ్వర్లు రూ. 1,00,000, కారుసాల శైలజ రూ. 50,000లు విరాళం అందించారు. వారిని ఎమ్మెల్యే అభినందించారు. వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య పొలం పిలుస్తోంది పుస్తకం ఆవిష్కరించారు. తెదేపా, భాజపా, జనసేన నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

వినాయక చవితి శుభాకాంక్షలు

టీడీపీ జిల్లా అధ్యక్షులు డాక్టర్లు నూకసాని

విశాలాంధ్ర-ఒంగోలు : ప్రథమ పూజ్యుడు, ప్రమధ గణాలకు అధిపతి అయిన ఆ గణేషుని వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ ప్రకాశం జిల్లా ప్రజలకు "వినాయక చవితి" శుభాకాంక్షలు తెలియజేశారు. ఆ గణపతి యొక్క ఆశీస్సులు ప్రతి ఒక్కరికి ఉండాలని, ప్రతి ఇంట్లో ఆనందం వెల్లి విరియాలని నూకసాని మనస్ఫూర్తిగా కోరారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మట్టి గణపతి విగ్రహాలను పూజకు వినియోగించాలని నూకసాని బాలాజీ ప్రకాశం జిల్లా ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

పోలీస్ సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత

- ఎస్పీ తుషార్ డూడి

విశాలాంధ్ర - బాపట్ల : నిత్యం ప్రజాసేవలో నిమగ్నమై ఉండే పోలీస్ సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తామని జిల్లా ఎస్పీ తుషార్ డూడి తెలిపారు. పోలీస్ సిబ్బంది యొక్క శాఖాపరమైన సమస్యల పరిష్కారానికి శుక్రవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ పోలీస్ గ్రీవెన్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా పోలీస్ సిబ్బంది సంక్షేమానికి ముఖ్య ప్రాధాన్యతను ఇస్తూ సిబ్బంది యొక్క వృత్తిపరమైన, ఆరోగ్యపరమైన, వ్యక్తిగతమైన పలు సమస్యలను పరిష్కరించటానికి జిల్లా ఎస్పీ గ్రీవెన్స్-డేను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని పోలీస్ సిబ్బంది పాల్గొని వారికి ఉన్న సమస్యలను ఎస్పీకి స్వయంగా విన్నవించుకున్నారు. పోలీస్ సిబ్బంది విన్నవించుకున్నా సమస్యలను ఎస్పీ కూలంకషంగా విని, విన్నపాలను పరిశీలించి సత్వర పరిష్కారంకు అవకాశం వున్న సమస్యలను వెంటనే పరిష్కరించారు. మిగిలిన సమస్యలను త్వరలోనే పరిష్కారం చూపుతామని పోలీస్ సిబ్బందికి భరోసా కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రజల ధన, మాన, ప్రాణాల రక్షణకై పాటుపడుతూ నిత్యం ప్రజా సేవలో నిమగ్నమై ఉండే పోలీస్ సిబ్బంది యొక్క సమస్యలను తెలుసుకొని వాటిని సత్వరమే పరిష్కరించడానికి గ్రీవెన్స్-డే కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్.బి ఇన్స్పెక్టర్ జి.నారాయణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పగడాల హారం బహూకరణ

విశాలాంధ్ర - వేటపాలెం : మండల పరిధిలోని రామన్నపేట పంచాయితీ రావూరిపేట శివారులో వేంచేసియున్న శ్రీకనక నాగవరపమ్మ అమ్మవారికి బంగారపు పగడాలహారంను శుక్రవారం పాటిబండ్ల నరసింహారావు (లేట్) వారి చిన్న మనమరాలు, గుడ్లూరు మండలం చిన్న పావని గ్రామ వాస్తవ్యులు వేళ్ళ శ్రీనివాసులు నాయుడు దంపతులు కుమారులు, కోడళ్ళు, వేళ్ళ వెంకట శివరామకృష్ణ ప్రసాద్ ధర్మపత్ని షీలా రాణి, వేళ్ళ రాకేష్ కుమార్ ధర్మపత్ని సవిత, మనవరాళ్లు ప్రశిధ వైష్ణవి, త్రినయిని, లక్ష్మీ అక్షర వారి కుటుంబ సభ్యులు సహకారంతో కనక నాగవరపమ్మ అమ్మవారికి వినాయకచవితి పండుగ సందర్భంగా శుక్రవారం సుమారు రూ.40 వేలు విలువగల బంగారంతో కూడిన పగడాల హారం అమ్మవారికి మొక్కుబడి కింద బహూకరించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి ధూప దీప నైవేద్యములు చెల్లించి బంగారు పగడాల హారము వారు అలంకరించారు. అమ్మవారి కమిటీ సభ్యులు మాజీ చైర్మన్ అచ్చంశెట్టి భానుమూర్తి, బండ్ల బాబుకు పగడాల హారమును అందజేశారు. యారాసు అరుణ్ బాబు, సిబ్బంది ప్రవీణ్ పాల్గొన్నారు.

విద్యుత్ కార్మికులకు సెల్యూట్

విశాలాంధ్ర - రేపల్లె : భారీ వర్షాలు సంభవించినా, వరదలు వచ్చినా పిడుగులు పడ్డ రేయి అనక పగలనక 24 గంటలు ప్రాణాలను పణంగా పెట్టి ప్రజాసేవ కోసం, విద్యుత్ వినియోగదారులకు వెలుగునిస్తూ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా కష్టపడుతున్న విద్యుత్ కార్మికులు, సిబ్బందికి ప్రతి ఒక్క విద్యుత్ వినియోగదారుడు సెల్యూట్ చేయాల్సిందే. ఇటీవల భారీ వర్షాలు వరదలకు విద్యుత్ పోల్స్ క్రిందపడి విద్యుత్ తీగలు తెగిపోవడంతో తిరిగి కార్మికులు విద్యుత్ వినియోగదారులకు విద్యుత్తును సరఫరా చేయాలనే సంకల్పంతో బాధ్యతాయుతంగా భారీ వర్షాల నేపథ్యంలో రాష్ట్ర ప్రజలకు ఎన్ని సమస్యలు వచ్చినా ప్రజలకు నిరంతరం విద్యుత్ అందించాలనే బాధ్యతతో విద్యుత్ కార్మికులు, ఉద్యోగులు భారీ వర్షాన్ని కూడా లెక్కచేయకుండా కరెంటు స్తంభం ఎక్కి పనులు చేస్తున్న ఉద్యోగులకు మనందరం ఒకసారి కార్మిక సోదరులకు సెల్యూట్ చేద్దాం.

ఇసుక కొరతను తీర్చండి

- గత ప్రభుత్వంలో ట్రాక్టర్ ఇసుక మూడు వేల ఐదువందలు ప్రస్తుతం ఐదు వేలు ఉచితమెక్కడ..
- భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ నిధిని పునరుద్ధరించండి

విశాలాంధ్ర - చీరాల : ఇసుక కొరతతో భవన నిర్మాణ కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిరుమల ప్రకాష్ అన్నారు. చీరాల ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ఉచిత ఇసుక విధానంపై విలేఖరుల సమావేశం నిర్వహించారుఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిరుమల ప్రకాష్, ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి బాసి పైదయ్యలు మాట్లాడుతూ పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న చందంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఉచిత ఇసుక విధానం ఉందన్నారు. మూలిగే నక్కపై తాటికాయ పడ్డట్లు గత ప్రభుత్వ హయంలో ఇసుక కొరతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రజలు భవన నిర్మాణ కార్మికులు నూతన ప్రభుత్వం లో కూడా అంతకు మించి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికార కూటమి ప్రభుత్వం చెప్పిందొకటి చేస్తుంది మరొకటి పేదలకు ఉచితంగా ఇసుకను అందుబాటులోకి తెస్తామని చెప్పి ట్రాక్టర్ ఇసుక 5000 పైచిలుకు అమ్ముతున్నారన్నారు. స్వతహాగా ఇసుక ప్రాంతమైన చీరాలలోనే ఇసుక కొరతతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మరి మెట్ట ప్రాంతాల ప్రజల పరిస్థితులేమిటో ప్రభుత్వమే ఆలోచించాలన్నారు. రెక్కాడితే కానీ డొక్కాడని భవన నిర్మాణ కార్మికులు ఉపాధిలేక తీవ్ర సంక్షోభం ఎదుర్కొంటున్నారని ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉచిత ఇసుక విధానం అమలు చేయాలన్నారు. గతంలో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ నిధి బోర్డు ఉండేదని గత టీడీపీ, వైసీపీ ప్రభుత్వాలు బోర్డును నిర్వీర్యం చేశారన్నారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన బోర్డును తిరిగి పునరుద్ధరించి భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా వినాయకచవితి జరుపుకోవాలి

ఎస్పీ తుషార్ డూడి

విశాలాంధ్ర - బాపట్ల : జిల్లా ప్రజలు ప్రశాంత వాతావరణంలో వినాయక చవితి వేడుకలను జరుపుకోవాలని జిల్లా ఎస్పీ తుషార్ డూడి తెలిపారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ ప్రజలు వినాయక చవితి పండుగను భక్తి సమరస్యాలతో, ఆనందోత్సాహల మధ్య జరుపుకోవాలన్నారు. ప్రజలందరికీ సకల శుభాలు కలిగే విధంగా గణనాథుడు అన్నివేళలా దీవించాలని, ఏ పని మొదలుపెట్టినా ఎలాంటి విఘ్నాలు లేకుండా పూర్తయ్యేటట్లు చూడాలని, సుఖ సంతోషాలతో ఉండాలని ఎస్పీ ఆకాంక్షించారు. పోలీస్ శాఖ సూచించిన నిబంధనలు కమిటీ వారు తప్పనిసరిగా పాటించాలని ఎస్పీ తెలిపారు. పోలీస్ శాఖ సూచించే సూచనలు, విధించే నిబంధనలు, ఏటువంటి అవాంఛనీయ ఘటనలు తావులేకుండా సంతోషకరమైన వాతావరణంలో వినాయక చవితి పండుగను ప్రజలు జరుపుకోవాలని తెలిపారు. జిల్లాలో వినాయక చవితి పందిళ్ళు, మండపాల ఏర్పాట్ల లో ఉత్సవ కమిటీ వారు, పోలీసు వారి సూచనలు తప్పనిసరి పాటించాలన్నారు. ప్రశాంతమైన వాతావరణంలో పండుగ నిర్వహించుకోవాలని సూచించారు. ఎక్కడైనా ఏవైనా అవాంఛనీయ సంఘటనలు తలెత్తితే వెంటనే సంబంధిత పోలీస్ అధికారులకు (లేదా) డయల్ 100,112 లకు కాల్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. వినాయక మండపాల ఏర్పాట్లలో కమిటీ వారు నిబంధనలు తప్పకుండా ఆచరించే విధంగా చర్యలు తీసుకోవాలని, వినాయక చవితి రోజు నుండి నిమజ్జనం వరకు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. జిల్లా ప్రజలకు, పోలీస్ సిబ్బందికి, పాత్రికేయులకు ఎస్పీ వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు.

మట్టి వినాయక విగ్రహాల పంపిణీ

విశాలాంధ్ర - చీరాల రూరల్ : పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి వినాయక విగ్రహాలను చీరాలలో ప్రజలకు ఉచితంగా పంపిణీ చేశారు. స్థానిక నల్లగాంధీ బొమ్మ ఎదురు వీధిలో ఒగేటి శాస్త్రి మట్టి వినాయక ప్రతిమలను, గొడుగులను, వినాయక వ్రత కల్పం పుస్తకాలను పంపిణీ చేశారు. యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎన్ఆర్అండ్‌పీఎం వాకర్స్ అసోసియేషన్ సభ్యులు స్థానిక గర్ల్స్ హైస్కూల్ వద్ద ఉన్న శ్రీ మహాలక్ష్మీ అమ్మవారి చెట్టు వద్ద మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన

విశాలాంధ్ర - యద్దనపూడి : పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా మెరుగైన ఆరోగ్యాన్ని పొందవచ్చని సూపర్‌వైజర్ సిహెచ్ సుజాత అన్నారు. మండలంలోని జాగర్లమూడి అంగన్వాడీ కేంద్రంలో పౌష్టికాహార వారోత్సవాలను నిర్వహించారు. పోషకాలపై బాలింతలకు గర్భిణీలకు అవగాహన నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అనారోగ్యంతో ఉన్న పిల్లలను హెల్ప్ వారి సహకారంతో తగిన మందులు, వాడి సలహాలు తీసుకొని పిల్లల ఆరోగ్యం మెరుగు పరుచుకోవాలన్నారు. ప్రతి ఒక్కరు పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలన్నారు. ఎం. నాగరాజు, పి.సునీత, కే.సుజాతమ్మ, టీ. త్రివేణి, అరుణకుమారి, ఎస్.కె హాజీజాబి పాల్గొన్నారు.

విక్రయాలకు వినాయక విగ్రహాలు సిద్ధం

విశాలాంధ్ర - రేపల్లె : వినాయక చవితి పర్వదిన సందర్భంగా పట్టణంలోని రాజ్యలక్ష్మి థియేటర్ ఎదురుగా చిన్న, పెద్ద అతిపెద్ద, సైజులలో వినాయక విగ్రహాలు అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయి. విగ్రహాలు తయారుచేసిన తయారీదారులు విగ్రహాలను సైజులను బట్టి 3000 నుండి లక్ష రూపాయల వరకు విగ్రహం రేటును నిర్ణయించి అమ్మకాలు జరుపుతున్నారు. గత కొద్దిరోజు లుగా భారీ వర్షాల ప్రభావంతో వినాయక విగ్రహాలు అమ్మకాల జోరు తగ్గింది. గురు, శుక్రవారాల్లో వర్షం తగ్గడంతో విగ్రహాలను కొనుక్కునేందుకు మంటపాల నిర్వాహకులు రాజ్యలక్ష్మి బసవేశ్వర థియేటర్ సెంటర్‌కు వచ్చి విగ్రహాలను కొనుకుంటున్నారు. దీంతో బస్టాండ్ సెంటర్, రాజ్యలక్ష్మి థియేటర్, బసవేశ్వర థియేటర్, ప్రాంతాల్లో పండుగ వాతావరణం నెలకొంది. ఇప్పటికే వినాయక వ్రతకల్పం పూజకు సంబంధించిన అన్ని సామాగ్రిలు పత్రిలు విక్రయించేందుకు స్టాల్స్ ఏర్పాటు చేసి విక్రయాలు జరుగుతున్నాయి. పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకునేందుకు వీలుగా అన్ని వర్గాల వారు వినాయక చవితి పండుగను స్వాగతిస్తున్నారు. దీంతో కూరగాయల మార్కెట్ వద్ద, నెహ్రూ విగ్రహం సెంటర్, చంద్రమౌళి పార్క్, రాజ్యలక్ష్మి థియేటర్, బస్టాండ్ సెంటర్ వద్ద గణ నాధుని పూజకు సంబంధించిన అన్ని రకాల వ్రతకల్పం అమ్ముతూ ఉండటంతో పట్టణంలో పండుగ వాతావరణం నెలకొంది.

పశుదాణా పంపిణీ కేంద్రాన్ని జేసీ ప్రకార్ జైన్ పరిశీలన

విశాలాంధ్ర - బాపట్ల : పశుదాణా పంపిణీ కేంద్రాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ ప్రకార్ జైన్ శుక్రవారం పరిశీలించారు. కొల్లూరు మండలంలోని వరద ప్రభావిత గ్రామమైన పోతర్లంకలోని పశుదాణా పంపిణీ కేంద్రాన్ని సందర్శించారు. అనంతరం పశుదాణా తీసుకోవడం కోసం వచ్చిన కొంతమంది రైతులకు పశుదాణా పంపిణీ చేశారు. జిల్లా పశువర్ధక శాఖ అధికారి డాక్టర్ హనుమంత్ రావు, డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.